Akella Raghavendra's
Online-ias.com

Akella Raghavendra's
Online-ias.com

ఆత్రేయసాహితి

రెండవ సంపుటం

ప్రమోదూత - ఉగాది

1990


ముఖపత్రం :

గంగాధర్

ముద్రణ :

క్రాంతి ప్రెస్,

మదరాసు-1

ప్రతులకు :

మనస్విని

పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్,

ఎ. సి. 4, సెకండ్ ఎవెన్యూ

అన్నానగర్

మదరాసు - 600 040

లేక

నవోదయా పబ్లిషర్స్

కారల్‌మార్క్స్ రోడ్

విజయవాడ - 520 002

వెల

ఏడు సంపుటాలు (సెట్) :

రూ. 225/-



Akella Raghavendra's
Online-ias.com

PRESENTED
BY
Prof. KORLAPATI
SRIRAMAMURTHY, D.Litt

# ఆత్రేయ సాహితి

రెండవ సంపుటం

## నాటకాలు-2

సంపాదకుడు :

కొంగర జగ్గయ్య

సహసంపాదకుడు :

పైడిపాల

మనస్విని
పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్
మదరాసు

Akella Raghavendra's
Online-ias.com

# ఆత్రేయ గురించి ....

అసలు పేరు : కిళాంబి వెంకట నరసింహాచార్యులు.

కలం పేరు : పేరులోని 'ఆచార్య' + గోత్రంలోని 'ఆత్రేయ' వెరసి: ఆచార్య ఆత్రేయ.

పుట్టింది : 7-5-1921 న నెల్లూరు జిల్లా. సూళ్లూరుపేట తాలూకా మంగళంపాడు గ్రామంలో.

పెరిగింది : ప్రాథమిక విద్యాభ్యాసం వరకూ, స్వగ్రామమైన 'ఉచ్చూరు'లో. తరువాత మేనమామల ఇంట్లో—

తల్లిదండ్రులు : శ్రీమతి సీతమ్మ. శ్రీ కృష్ణమాచార్యులు.

చదువు : ఎస్.ఎస్.ఎల్.సి. వరకు చిత్తూరులో — ఇంటర్మీడియెట్ రాయ వెల్లూరులోని ఊరీస్ కళాశాలలో — టీచర్స్ ట్రెయినింగ్ చిత్తూరులో.

వివాహం : 1940 లో, శ్రీమతి పద్మావతితో.

రాజకీయాలు : 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళటం; 1955 లో కమ్యూనిస్ట్ పార్టీకోసం ప్రచార ప్రదర్శన లివ్వటం.

ఉద్యోగాలు : నెల్లూరు మున్సిఫ్ కోర్టులోనూ, తిరుత్తణి సెటిల్‌మెంట్ ఆఫీసులోనూ గుమాస్తాగానూ - 'జమీన్ రైతు' పత్రికలో సహాయ సంపాదకునిగానూ - ఆంధ్ర నాటక కళాపరిషత్తులో వేతనకార్యదర్శిగానూ.

రచనలు : పోయినవి పోగా పది నాటకాలూ, పదిహేను నాటికలూ, సుమారు 400 చిత్రాలకు మాటలూ, పాటలూ, పద్య కవితయూ....

బిరుదులు : ఇచ్చినవి మరచిపోగా, జనంనోళ్ళలో 'మనసుకవి'. 1989 మే లో సార్వత్రిక విశ్వవిద్యాలయం వారి డాక్టరేట్.

నిర్యాణం : 13-9-1989 బుధవారం రాత్రి 10 గం॥కు మదరాసులో.

Akella Raghavendra's
Online-ias.com

# మా మాట

ఆచార్య ఆత్రేయ చివరి రోజులలో. ఆయన కోరిక మేరకు, ఆయన ఆమోదంతో, 'ఆత్రేయ సాహితి'కి పరిమిత పరిధిలో అంకురార్పణ చేశాం. ఆయన మరణానంతరం, పెరిగిన మా బాధ్యతను పురస్కరించుకుని, 'మనస్విని' ట్రస్టును నెలకొల్పి, ఆయన రచనలన్నీ వివిధ సంపుటాలలో ప్రచురించాలన్న విస్తృత కార్యక్రమాన్ని చేపట్టాం.

లభ్యమైన శ్రీ ఆత్రేయ రచనలన్నీ ఏడు సంపుటాలుగా విభజించాం. నాటకాలు రెండు సంపుటాలు, నాటికలు ఒక సంపుటం, సినిమా పాటలు మూడు సంపుటాలూ, ఆత్మకథ మొదలైన ఇతర రచనలన్నీ కలిపి ఒక సంపుటమూ. అనేక చలనచిత్రాలకు శ్రీ ఆత్రేయ వ్రాసిన సంభాషణలను మాత్రం గ్రంథస్థం చేయడం సాధ్యంకాలేదు - కాదు. అందుకు కారణాలనేకం. 1947 కి ముందు శ్రీ ఆత్రేయ వ్రాసిన నాలుగు నాటకాలూ, స్వాతంత్ర్యం రాగానే వ్రాసిన ఒక నాటకమూ కలిపి మొదటి సంపుటంగానూ, 1947 తరువాత వ్రాసిన అయిదు నాటకాలూ రెండవ సంపుటంగానూ వెలువరిస్తున్నాము. అయితే, తొలి రోజులలో ఆయన వ్రాసిన 'శాంతి', 'సాధన', 'డాక్టర్ కోట్నీస్' నాటకాలు మాత్రం ఎక్కడా లభ్యం కాలేదు అది తీరని కొరత.

ఈ మహత్తర కృషిని ఆదరించి, 'మనస్విని' ట్రస్టుకు విరాళాలందించి, ప్రోత్సహించిన చిత్రసీమ ప్రముఖుల, ట్రస్టు సభ్యుల ఔదార్యానికి మేము సర్వదా ఋణపడి వున్నాం. అందులోనూ నిర్మాతలు శ్రీ కె. దేవీ వరప్రసాద్, శ్రీ కె. మురారి ఆదినుండీ అందించిన అండదండలు మరువలేనివి.

'ఆత్రేయ సాహితి' ఈ రూపంలో వెలువడడానికి మిత్రుడు శ్రీ పైడిపాల చేసిన పరిశ్రమ విలువ కట్టలేనిది. ఈ కృషిలో మాకు బాసటగా నిలిచిన (రాజమండ్రి పేపర్ మిల్స్) శ్రీ ఎస్. బి. చౌదరికీ, శ్రీ అవధానికీ, 'క్రాంతి ప్రెస్' అధినేత శ్రీ శ్రీధర్‌కీ, ముఖచిత్ర రచయిత శ్రీ గంగాధర్‌కీ, జర్నలిస్టు మిత్రుడు శ్రీ కౌండిన్యకీ మా కృతజ్ఞత.

ఈ ప్రచురణ ద్వారా మిత్రుడు శ్రీ ఆత్రేయ కడపటి కోరిక తీర్చగలిగామనీ మా బాధ్యతను నెరవేర్చుకోగలిగామనీ నమ్ముతున్నాం.

మదరాసు,

ప్రమోదూత - ఉగాది.

27-3-1990.

కొంగర జగ్గయ్య

సంపాదకుడు

Akella Raghavendra's
Online-ias.com

## మనస్విని

### పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్

### మదరాసు

మానేజింగ్ ట్రస్టీ:

శ్రీ కె. జగ్గయ్య
(సినీనటుడు)

ట్రస్టీలు

శ్రీ కె. యస్. ప్రకాశరావు
(సినీ దర్శక, నిర్మాత)

శ్రీ వి. బి. రాజేంద్రప్రసాద్
(సినీ దర్శక, నిర్మాత)

శ్రీ డి. రామానాయుడు
(సినీనిర్మాత)

శ్రీ ఎం. ఎస్. రెడ్డి
(సినీ నిర్మాత)

శ్రీ కె. దేవీవరప్రసాద్
(సినీ నిర్మాత)

శ్రీ కె. మురారి
(సినీ నిర్మాత)

శ్రీ ఎం. మోహన్‌బాబు
(సినీ నటుడు, నిర్మాత)

శ్రీ పైడిపాల
(మదరాసు యూనివర్శిటీ)

Akella Raghavendra
Online-ias.com

## ఈ సంపుటంలో . . .


| | | |
|---|---|---|
| 1. ఎన్. జి. ఓ | ... | 9 |
| 2. విశ్వశాంతి | .... | 75 |
| 3. కప్పలు | .... | 157 |
| 4. భయం | .... | 231 |
| 5. మనసూ - వయసు | .... | 301 |


Akella Raghavendra's
Online-ias.com

## ధన్యవాదాలు:

ఈ నాటకాల సేకరణలో
మాకు తోడ్పడిన

టి. వెంకటపతిరాజు గారికి
(విజయవాడ),

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్
(విజయవాడ - 2) వారికి

Akella Raghavendra's
Online-ias.com

# ఎన్. జి. ఓ.

ఆచార్య ఆత్రేయను 'ట్రెండ్ సెటర్' గా నిలిపిన సంచలన నాటకం ఎన్. జి. ఓ. రచనాకాలం 1948. రచయిత అనుమతితో ఈ నాటకం హిందీలోకి అనువదింపబడింది. అనుమతి లేకుండా కన్నడంలో 'లంచావతార' గా అవతరించింది. 1953 లో యిది 'గుమాస్తా' పేరుతో సినిమాగా వచ్చింది.

Akella Raghavendra's
Online-ias.com

# నా మాట

ఇది నా తృతీయ నాట్యపుష్పం. ఈ నాటకానికి తొలుత 'అద్దెకొంప' అని పేరు పెట్టాను. ఆ తరువాత నాటకంలో జరిగిన కొన్ని మార్పుల ననుసరించి ఎన్.జి.ఒ అన్నాను. ఈ రెండు పేర్లు నాటకంలోని ముఖ్యోద్దేశాన్ని ప్రస్ఫుటం చేయడానికి చాలవని అభిప్రాయపడుతున్నా. గత్యంతరం లేకపోయింది. 'ఎన్.జి.ఒ.' అని పేరేగాని, మన మధ్య తరగతి కుటుంబాల - అందులో పట్నవాసుల - అగచాట్లు. మనస్తత్వం ప్రెస్టేజి పేరిట పడుతూన్న ఆర్థిక సాంఘిక బాధలు చిత్రించటానికి ప్రయత్నించాను. ఏమాత్రం సఫలుణ్ణి కాగలిగానో ప్రజా బాహుళ్యమే నిర్ణయించాలి.

''అద్దెకొంప'' పేర ఈ నాటకం 10-12-48 న చెన్నపురి మ్యూజియం హాలులో యల్.ఐ.యం. కాలేజి విద్యార్థులచే ప్రదర్శింపబడ్డది. తరువాత ఎన్.జి.ఒ. పేరిట వెంకటగిరి అమెచ్యూర్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ వారిచే ఏలూరులో జరిగిన 15వ ఆంధ్రనాటక కళాపరిషత్సమావేశాలలో పోటీ నాటకంగా ప్రదర్శింపబడి ఉత్తమ ప్రదర్శనకూ, ఉత్తమ రచనకూ ప్రథమ బహుమానాలు పొందింది. ఎంతో కృషిచేసి నాటకాన్ని జయప్రదంగా ప్రదర్శించిన నా సమాజానికి నేను కృతజ్ఞతాభివందనము లర్పించటం ఆత్మస్తుతి కాదనే భావిస్తాను.

ఈ నాటకాన్ని ప్రదర్శింప దలచుకొన్నవారికి ఒక్క సూచన. నాటకంలో అక్కడక్కడ వున్న పాటల ముక్కలను ఏమాత్రం వాద్యమేళాలు, సంగీతపు కసరత్తులు లేకుండా పాడుకోవాలి. నాటకంలో సంగీతం లేదన్న భయంతో ఎక్కడగాని పాటలు పాడించవద్దని ప్రార్థన.

ఆంధ్ర ప్రజానీకం ఈ నాటకాన్ని ఆదరిస్తుందని ఆశిస్తున్నా.

చెన్నపురి
1-1-49

మీ
ఆత్రేయ

Akella Raghavendra's Online-ias.com

# ఇందులో

| | | |
|---|---|---|
| రంగనాథం | . | గుమాస్తా |
| గోపి | . | అతని తమ్ముడు |
| ముసలాయన | | అతని తండ్రి |
| డాక్టర్ | | అతని స్నేహితుడు |
| శేఖర్ | | గోపి స్నేహితుడు |
| గుప్త | | అద్దెకొంప యజమాని |
| శర్మ | . | గుప్త గుమాస్తా |
| శాస్త్రి | . | రంగనాథం బంధువు |
| విప్పగాడు | | |
| సబ్ ఇన్‌స్పెక్టర్ | | |
| కాన్‌స్టేబిల్ | | |
| దఫేదార్ | | |
| కాంపౌండర్ | | |
| పాలమనిషి | | |
| సీత | : | రంగనాథం భార్య |

వస్తారు.

కాలం: స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత.

స్థలం. రంగనాథం ఇల్లు—కాదు—ఒక మోటార్ షెడ్.

రంగాలు రెండు మాత్రమే.

Akella Raghavendra's
Online-ias.com

ఈ నాటకం
ఏలూరులో జరిగిన
15వ ఆంధ్ర నాటక కళాపరిషత్సమావేశాలలో
వెంకటగిరి అమెచ్యూర్ ఆర్టిస్ట్సు అసోసియేషన్ వారిచే
ప్రదర్శింపబడినది.

| | | |
|---|---|---|
| రంగనాథం | | శ్రీ కె. జగన్నాథ్ ప్రసాద్ |
| శాస్త్రి | . | విద్వాన్ శంకరశాస్త్రి |
| గోపి | . | శ్రీ ఆత్రేయ |
| ముసలాయన | | డాక్టర్ టి. దామోదరం |
| డాక్టర్ | | శ్రీ సి. జయరాంనాయుడు |
| శేఖర్ | : | శ్రీ జి. కబీర్‌దాసు |
| శర్మ | : | శ్రీ వేంకటాచలం |
| గుప్త | : | శ్రీ గరుడాచలం |
| యస్. ఐ. | : | శ్రీ ధర్మయ్య |
| కానిస్టేబుల్ | . | శ్రీ రామకృష్ణ |
| పాలమనిషి | | శ్రీ వెంకట సుబ్బయ్య |
| కాంపౌండరు | . | శ్రీ టి. జగన్మిత్ర |
| సీత | . | శ్రీమతి బి. బాలామణి |

Akella Raghavendra's
Online-ias.com

అది ఒక ఇల్లుగా మార్చబడి అద్దెకివ్వబడిన ఒక మోటార్ షెడ్. అందులోనే ఒక మధ్యతరగతి కుటుంబమంతా కాపురముంటూంది. అంతా ఒక పెద్ద గదిలాగుంటుంది. అందులోనే ఎడమవైపు వంటకు కొంచెం మరుగ్గా ఒక అడ్డుగోడ వుంది. దాన్ని వంటిల్లంటారు. కుడివైపు ఒక పాత మంచం, దానిమీద చిరిగిపోయినపరుపు, మాసిన బట్టలచుట్ట వున్నవి. గోడకు చేరుస్తారు. దానికి రెండుమూడు చొక్కాలు పాతగొడుగు వున్నవి. ఎదురుగా గోడలో ఒక పెద్ద కిటికీ ఆలమైరా వున్నవి. ఆలమైరామీదే దేవునిపటం. దానిక్రింద స్టాండుమీద ప్రమిద వెలుగుతూ వుంది. కిటికీలోనుంచి దూరంలోవున్న గుడిసె లగుపిస్తున్నాయి. పైన అటకలు, వాటిమీద పాతకాగితాలు, పుస్తకాలు. అవీ ఇవీ వున్నవి. దండెంమీద చీర ఆరేసివుంది. ఇంటికి కుడివైపు ఒక ద్వారం, ఎడమవైపు ఒక ద్వారం. ఆ ఇల్లు బంగళా కాంపౌండులో వున్న ఔట్ హౌస్ లాగుంటుంది. కుడివైపు ద్వారంగుండా వెళితే ప్రక్కనవున్న పెద్ద బంగళాకు దగ్గర. ఎడమవైపుద్వారం వీధిలోకి వెడుతుంది. ఇంట్లో రెండుమూడు పెయింటింగ్సు డ్రాయింగు పేపరుమీద నల్లసిరాతో సిల్హౌట్ లుగా గీయబడి, అట్టలమీద అతికించి తగిలించబడివున్నవి. వంటింటి గోడమీద విచ్చుగాంధీ బొమ్మ ఇంటికొచ్చిన అందరికి ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. తెర ఎత్తేసరికి ఇల్లంతా పొగచుట్టుకుని వుంది. ఆ పొగలో ఆ యింటి యిల్లాలు కామాక్షి, దేవుని పటంముందు నిలబడి వుంది. దూరంనుంచి రేడియోలోనేమో "వందేమాతరం" జాతీయగీతం వినిపిస్తూంది. గీతం రెండు చరణాలయేలోగా ఒక కుర్రాడు హుషారుగా ఆపాటే పాడుకుంటూ వచ్చాడు. దారిలోవున్న గ్లాసు కాలికి తగిలింది; ఆగాడు. ఆ చప్పుడుకు ఆ యిల్లాలు తిరిగి చూచింది.

ఇల్లాలు: అంత హడావుడి దేమొచ్చింది గోపీ! రాస్తా చూచి రారాదూ?

గోపి: అదికాదు వదినా! మద్రాసంతా చుట్టబెట్టి తిరిగి ఇల్లు చూచివచ్చాను.

ఇల్లాలు: ఇల్లే!

గోపి: ఆఁ....!

ఇల్లాలు: మనకే!

గోపి: ఆఁ... !

ఇల్లాలు: ఎక్కడ?

గోపి: ప్రక్కవీధిలోనే!

ఇల్లాలు: ఆఁ....! (ఫ్రిజలోంచి రెండు అరటిపండ్లు తెచ్చింది. మంచినీళ్ళు ఇచ్చింది) మంచిల్లేనా? బాగుందా?

గోపి: ఓ! పెద్దయిల్లు. ఎలెక్ట్రిక్ లైట్లు. కుళాయి. యింటిముందు కావలసినంత స్థలం, తోట. ఓహ్! పెద్దబంగళా అనుకో!

Akella Raghavendra
Online-ias.com

ఇల్లాలు: నిజంగా?

గోపి: హరిశ్చంద్రుడి సాక్షి!

ఇల్లాలు: ఇంతకూ ఖాళీగా వుందా?

గోపి: ఖాళీగా లేకుంటే ఎందుకు చెబుతాను రాణీ. ఆ ఇంట్లో కాపురం వుండాలంటే కొన్ని షరతులకు కట్టుబడి వుండాలి.

ఇల్లాలు: షరతులే!

గోపి: ఆఁ! ఏమనుకున్నావు మరి?

ఇల్లాలు: ఏమిటా షరతులు? చెప్పు బాబూ విందాం; అనుకూలంగా వుంటే చూద్దాం. ఈ చాలీచాలని కొంపల్లో ఎన్నాళ్ళని చస్తాం.

గోపి: ఏమిటంటే ...

1. ఆ యిల్లు బ్రాహ్మణులకు మాత్రమే ఇవ్వబడుతుందట.
2. అద్దె ముప్పయిరూపాయలు. కరెంటు పదిరూపాయలకు మాత్రమే; మిగతా యిరవై బ్లాకు డబ్బు.
3. ఆ యింటికి ప్రత్యేకం కొళాయి లేదు. ఆ కాంపౌండులోనే వున్న యజమానుల బంగళా వెనకనున్న కొళాయి వుపయోగించుకోవాలట. అదీ వుదయం ఒక గంట, సాయంత్రం ఒక గంటే వీలవుతుంది.
4. బంగళా ముందున్న తోటలో పిల్లలు తిరుగకూడదు. పూలు కోయకూడదు.
5. రాత్రి పదిగంటలమీద లైట్లు ఆర్పివేస్తారు. బంగళాగేటు వేసేస్తారు. ఇంటికొచ్చేవాళ్ళు ఆ లోపుగానే రావాలి.
6. బ్రహ్మచారు లెవ్వరూ వుండకూడదు.
7. సినిమాల్లో డ్రామాల్లో పనిచేసేవాళ్ళయితే అసలివ్వరట.
8. అయిదువందల రూపాయలు అడ్వాన్సు యివ్వాలి; అందుకు రశీదు పత్రం ఏమీ వుండదు. విన్నావా వదినా! ఇవీ షరతులు.

ఇల్లాలు: బాగున్నాయి! యీ షరతులకు మనుష్యు లెవ్వరూ వుండలేరు. దయ్యాలేమన్నా వుంటాయేమో!

గోపి: నిజం గ్రహించావు వదినా! ఆ యింట్లో దయ్యం వుంది.

ఇల్లాలు: ఏమిటి గోపీ! నిజంగా దయ్యమే కొంపతీసి?

గోపి: అవు వదినా! ఆ యింట్లో ఒక పోర్షన్లో పెద్ద దయ్యముంది.

Akella Raghavendra's Online-ias.com

ఇల్లాలు: వద్దులే బాబూ! ఒసి రా కొంపా వద్దూ. దయ్యం చేతుల్లో చావూ వద్దు. ఏ అర్ధరాత్రిలోనో గొంతు పిసికేస్తే ఏమి కావాలి? మీ అన్నయ్య కూడా ఎప్పుడు రామే ఇంట్లో; ఆయన కా ఆఫీసే పెళ్ళాం బిడ్డలు!

గోపి: ఏం వొదినా అట్లా గాబరాపడతావ్? దయ్యంకోసం భయపడి ఈ యింట్లో - చావు - ఏ మోటారుకిందపడ్డామో ఏ పురుగుకాటుకి చస్తామో - ఈ దోమ ఎంతో చద్దామనుకుంటావా? దీనికన్నా దయ్యం చేతుల్లో చావటం మేలు బాబూ! అబ్బ ఒళ్ళు పులకరించేస్తుంది. గాలిదేవుడీ యింట్లోకి రావాలంటేనే జంకుతాడునా!

ఇల్లాలు: బయట కూడా గాల్లేదు. వర్షం వస్తుందేమో?

గోపి: వర్షంవస్తే, ఇది వున్నది మనకు చాప. అదిగాదు వదినా! అసలీ యింట్లో దయ్యం లేదనా నీ యభిప్రాయం?

ఇల్లాలు. చాల్లే నీ అఘాయిత్యం! ఇంతకాలంగా కాపురముంటున్నాం, నే నొక్కసారి కూడా చూడలేదే దెయ్యాన్ని?

గోపి: నేను ప్రతిరోజూ చూస్తున్నా వొదినా! అన్నయ్యకూడా అప్పుడప్పుడు చూస్తూంటాడు.

ఇల్లాలు: ఆఁ...ఏమిటా వేళాకోళం! నాతో ఒక్కసారన్నా చెప్పలేదేం మీ అన్నయ్య?

గోపి: అన్నయ్యకు నెల కొకసారి కనిపిస్తుందట ఆ దయ్యం. ఆఫీసునుంచి జీతం పట్టుకురాగా నే వాకిట్లో హాజరు. దాంతో అన్నయ్యకు గుండెలు జారిపోతాయి. పాపం. నాతో ఎన్నోసార్లు చెప్పాడు. నేను చూశానుకూడా.

ఇల్లాలు: అందుకేనేమో బాబు! ఈ యింటికొచ్చినప్పటి నుంచి అందరికీ ఒకటే రోగాలు. పెద్దవాడి కా దగ్గు పట్టుకుందా? ఆ పసిదానకు వాయువు తగిలిందా? నాకు నానాటికీ కాళ్ళు చేతులు చచ్చుబడిపోతున్నాయి. "వద్దుబాబూ ఈ యిల్లు మార్చేద్దాం" అంటే వింటారా నామీద ఎగిరిపడతారు - "బంగళాలొస్తాయే మన బ్రతుక్కి" అని. పాపం ఆ డాక్టరుగారుకూడా ఎన్నోసార్లు చెప్పారు: ఇల్లు మార్చేయమని. బంగళాల్లోకిపోరే మాని: దయ్యాల్లేని కొంపయినా దొరకకూడదా భగవంతుడా!

గోపి: పిచ్చొదినా! భ్రమపడుతున్నావు: పట్నంలో మనలాంటివాళ్ళు కాపరముండే ప్రతి అద్దెకొంప ఒక దయ్యం కొంపే: తెలుసా? అందులో ఎలాంటి దయ్యాలు? పట్టపగలు కనబడే దయ్యాలు! కార్లల్లో తిరిగే దయ్యాలు! లక్షలూ కోట్లు బ్యాంకుల్లో దాచిపెట్టుకు చచ్చే దయ్యాలు! మాట్లాడే దయ్యాలు!

Akella Raghavendra's Online-ias.com

పిల్లాలు: (ప్రతియొక్కరికీ గాభరాపడుతుంది. పాపం చివరకు) గోపీ! (అరిచింది)

గోపి: (పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వుతున్నాడు. కొద్దిసేపటిలో కారు హారన్ శబ్దం. టకటక బూట్లు చప్పుడు.)

గోపి: (నవ్వు ఆపి అటుతిరిగి) నమస్తే! డాక్టరుగారు.

డాక్టరు: (లోపలికివస్తూ) నమస్తే! (చేతిరుమాలుతో ముక్కు మూసుకొచ్చాడాయన)

గోపి: రండి-కూర్చోండి! (ఏదో నాటక ప్రకారం మర్యాదకు అన్నాడేకాని ఎక్కడ కూర్చోబెట్టాలన్న సమస్య ఎదుర్కొంది. గాబరాగా అటూఇటూ చూచి, మంచంమీద వున్న గుడ్డలూ అవి తీసివేయబోతుంటే డాక్టరు చూచాడు)

డాక్టరు: అక్కరలేదులే అబ్బాయి!

గోపి: (అన్నదే చాలని వూరుకున్నాడు)

డాక్టరు: (ఈపాటి కాయింట్లో ఎఱ్ఱబారిన కళ్ళను తుడుచుకుంటూ) అబ్బ! హెల్ హారిబుల్! ఇంకా మీరీ ఇంట్లో కాపురం ఎలా వుంటున్నారో తెలియడంలేదు.

గోపి: మాకు తెలిస్తేనా మీకు తెలియడానికి?

డాక్టరు: ఇంటిముందు మురుగు కాలువ మూయించమని ఎన్నిసార్లు చెప్పాను? మరీ ముక్కులు పగిలిపోతున్నాయి. నో, నో, ఏం లాభంలేదు.

గోపి: ఎందుకు లేదండీ డాక్టరుగారూ? మురుగుకాలువ మూయిస్తే మాకు రోగాలెట్లా వస్తాయి? రోగాలు రాకుంటే డాక్టర్లేంకావాలి?

డాక్టరు: (నవ్వి) అదీ నిజమే! నాన్నగారెక్కడ?

గోపి: బయట వరండాలో పడుకున్నారు;

డాక్టరు: వరండాలోనా?

గోపి: ఆఁ!

డాక్టరు: నో! నో! దిస్ ఓంట్ డు! పెరాలిసిస్ పేషెంటును తీసుకెళ్ళి బయట వరండాలో - అదీ యీ వాతావరణంలో - పడేస్తారా; ఏమనన్నా? మీ రామాత్రం శ్రద్ధ తీసుకోకపోతే నేనెంత వైద్యంచేసి ఏం లాభం. హా హా? మోస్టు ఇర్రెస్పాంసిబుల్!

గోపి: కోప్పడకండి డాక్టరుగారూ!

డాక్టరు: ఏమిటి కోప్పడకండి? మీకు చస్తే భయంలేదు. అంతటితో పోతుందా? యిట్లా అశ్రద్ధవల్ల నలుగురూ నా చేతుల్లో పోతే నా ప్రాక్టీసేంకావాలి? మీరేమన్నా ఆలోచించారా?

గోపి: ఇలాంటి అద్దెకొంప ఉన్నంతవరకు మీ ప్రాక్టీసుకేం భయంలేదులెండి.

Akella Raghavendra's Online-ias.com

డాక్టరు: (నవ్వొచ్చినా కోపం నటిస్తున్నాడు)

గోపి: ఇంకా రాని-వయసుకు మించిన మాటలు మాట్లాడుతున్నందుకు కోప్పడకండేం?

డాక్టరు: సరేలే! మహాబుద్ధిమంతుడివి. అబ్బ! ఉక్కపెట్టేస్తోంది; వర్షం వస్తుందేమో! పేషంట్ నిలా తీసుకురా!

గోపి: ఇక్కడికాండి?

డాక్టరు: ఆఁ.

గోపి: పక్షవారానికి పొగ మంచిదాండి?

డాక్టరు. షటప్!

గోపి: ఒక్కసారి (భుజా లెగరేసి వెళ్ళాడు.)

డాక్టరు: ఆ మీ కెట్లాగుందమ్మా?

ఇల్లాలు: (ఇంతవరకూ యింటిపని ఏదో చేసుకుంటూన్న యిల్లాలు ఆ పని వదలి వచ్చి) దిన దినానికీ మరీ కాళ్ళు చేతులు చచ్చుపడిపోతున్నాయండీ!

డాక్టరు: ఆ మందు తీసుకొంటూన్నారా?

ఇల్లాలు: టానిక్కాండి!

డాక్టరు: ఆఁ.

ఇల్లాలు: ... .........

డాక్టరు: తీసుకోవటంలేదా?

ఇల్లాలు: వారొచ్చేటప్పటికి ప్రతిరోజూ తొమ్మిదీ పదీ అవుతుంది. ఆ వేళకు కొట్లన్నీ కట్టేస్తున్నారట.

డాక్టరు: ఊఁ! మందు రాసిస్తే తీసుకోకపోతే ఎలా తగ్గుతుందమ్మా! మీ రా టానిక్ పుచ్చుకొని మంచి ఆహారం, పళ్ళు పాలు తీసుకొంటేగానీ మీ కా బలహీనత తగ్గదు. కేవలం రక్తంలేదంటే సరా? ఊఁ. పిల్లలేలాగున్నారు?

ఇల్లాలు: పెద్దవాడి కా దగ్గు మళ్ళా అధికమైందండి.

డాక్టరు: ఆఁ.

ఇల్లాలు: చిన్నవాడికి రెండురోజులుగా జ్వరం వస్తూంది.

డాక్టరు: రెండు రోజులనుంచా?

ఇల్లాలు: అవునండి. ఏదో పోతుందిలే అని నాకు తెలిసిన నాలుగు మందులూ వాడాను. నంచె జ్వరమేమోనని దిష్టికూడా తీసిపేశాను.

డాక్టరు: ఊఁ-మంచిపనిచేశావు. జ్వరం రోజల్లా వుంటుందా?



Akella Raghavendra's Online-ias.com

ఇల్లాలు: లేదండి. రోజూ సాయంత్రం కాగానే వస్తుంది; చలిజ్వరం!

డాక్టరు: పిల్లాడెక్కడ?

ఇల్లాలు: ఈ యింట్లో వుండడానికి చోటులేకుంటే ఆ పక్కింటివాళ్ళ కాళ్ళావేళ్ళా పడి, ఆ వరండాలో మంచంవేసి పడుకోబెట్టా నిద్దర్లో! ఏంచేయను చెప్పండి? జానెడు కొంప!

డాక్టరు: బాగుంది. నేనా రోజే చెప్పాను. మీకు ఇంటిచుట్టూ మురుక్కాలువలుంటే మలేరియా రాకేంచేస్తుంది? (చేతిమీద ఠపీమని యింకో చేత్తో కొట్టుకొని) హారిబుల్. దోమలుకావురా బాబూ ఏనుగులు; మీరు దోమతెరలు తప్పక వాడాలి. లేకుంటే మీకందరికీ మలేరియా తప్పదు. (గోడలోవున్న కిటికీ అవతల ఒక 60 ఏళ్ళ ముసలాయన్ను పట్టుకొని గోపి కనుపిస్తాడు.)

గోపి: (అవతల నుండి) నాన్నా! నాన్నా! డాక్టరుగారూ.... డాక్టరుగారు. డాక్టరుగారొచ్చారు (అని గట్టిగా అరచి చెప్తూ) ఇంట్లో ఉన్నారు. మిమ్మల్ని చూట్టానికి వచ్చారు. (మెల్లిగా నడుపుకొస్తున్నాడు.)

డాక్టరు: ఇదిగోనమ్మా! నేనెన్ని మందులిచ్చినా ఏమీ లాభంలేదు. మీరు కాస్త శ్రద్ధతీసుకోవాలి మీ ఆరోగ్యాలను గురించి. మంచి ఆహారం పుచ్చుకోవాలి. దోమతెరలు వాడాలి. అన్నిటికంటె ముందు ఈ యింటిముందు మురుక్కాలువ మూయించాలి. (ఈ మాట లంటూండగా గోపి మెల్లిగా ముసలాయన్ను లోపలికి నడిపించుకొచ్చాడు. ఇల్లాలు మంచం వాల్చింది. ముసలాయన్ను ఆ మంచంపై వదిలి)

గోపి: డాక్టరుగారూ! దయచేసి ఆ మాట కాస్త ఈ మోటార్‌షెడ్‌ను అద్దెకిచ్చి 30 రూపాయలు కాజేస్తున్నాడే ఆ మహారాజుకు చెప్పండి; మీకు పుణ్యం వుంటుంది.

డాక్టరు: భేష్! మీకు పుణ్యముంటుంది, ఆ మురుక్కాలవను మీరే మూయించండి అన్లేదు!

గోపి: మరేం చేయమంటారండీ? ఈ మోటార్‌షేడ్‌ను ఇల్లుగా మార్చి నెలపుట్టగానే అడ్వాన్సుగా ముప్పై రూపాయలు కాజేస్తున్న అతనొక లక్షాధికారి. యాభై లక్షల గట్టిసొమ్ము యినప్పెట్టెలో మూలుగుతుంది - పలకరించే దిక్కులేక! ఆయన యిల్లెంత పెద్దదో తెలుసా? లంకంత కొంప! అందులో ఎందరున్నారు? అయిదుగురు! అయిదుగురికీ యాభై గదులు! కూర్చోటాని కొక గది. నుంచోటాని కొక గది. పడుకోటాని కొక గది. రీడింగు రూం,

Akella Raghavendra's Online-ias.com

డ్రాయింగ్ రూం. డైనింగ్ రూం, బెడింగ్ రూం, స్లీపింగ్ రూం, వంకాయ రూం. బెంకాయరూం. ఆయనకేం పట్టిందండి యీ పురుక్కాలవ మూయించాలని! ఆయనక్కావలసిందల్లా నెల తిరగ్గానే అద్దె. కాపురమున్న వాళ్ళు పూపిరితిపక్క చస్తే ఏం? రోగాలతో కుళ్ళిపోతే ఏం?

ఇల్లాలు: గోపీ ఎందుకు బాబూ అలా కేకలేస్తావ్?

గోపి: కేకలేంటి వదినా కడుపుమంటయితే?

డాక్టరు: ఈ నాలుగుమాటలు ఆయన్నే అడగలేకపోయావ్?

గోపి: ఆయన్నేంటి .. ఆయన .. బాబుల్ని అడుగుతా....? సమయం కోసం చూస్తున్నాగాని.

డాక్టరు: భేష్! (ముసలాయనతో) ఏదీ....మెల్లగా లేచినిలబడండి చూద్దాం. (మెల్లగా లేచాడు కాని నిలబడలేడు పడిపోయేటట్టుంటే డాక్టరు పట్టుకొని కూర్చో బెట్తాడు.)

డాక్టరు: ఏం ఫర్వాలేదు. తగ్గిపోతుంది.

ముస: దా....దానికి ఆ మూడుముళ్ళూ పడుతుందంటారా?

డాక్టరు: దేనికి?

గోపి: ఆయనగోల ఆయన్ది. దానికి పెళ్ళి కాకుంటే ప్రపంచమంతా మునిగిపోతుం దనుకుంటాడు.

డాక్టరు: ఎవరికి?

గోపి: ఎవరికో అయితే మా కెందుకు. నా అక్కయ్యకు పెళ్ళీడు మించిపోతూందట! అదీ ఆయ నేడుపు. నిన్నటి నుంచి ఈ క్రొత్త జబ్బొకటి కూడా పట్టుకుంది.

డాక్టరు: ఎక్కడ ఆ అమ్మాయి. ఎప్పుడూ అగుపించలేదే?

గోపి: మా మేనమామగారి యింట్లో వుంది లెండి. ఈ కొంపలో - కాదు - ఈ మోటార్ షెడ్డులో ఎందరని వుంటాం. యిప్పటికే చస్తుంటే.

ముస: (గోపీని దగ్గరకు రమ్మని సైగజేస్తాడు.)

గోపి: (దగ్గరకు వెళ్ళి) ఏం? (విసుగ్గా అరిచాడు)

ముస: ఎందుకురా అట్టా కసురుతావ్? నా కోసం మీరేమీ బాధపడనక్కర్లా! నా కీ మందులు, మాకులు అక్కర్లా! నే నింక బ్రతికుండి ఏం చెయ్యాలి? దాని మెడలో ఆ మూడుముళ్ళూ పడితే___

గోపి: పడకుంటే...?

ముస: (చూచారా అన్నట్లు డాక్టరుకేసి చూచాడు.)

డాక్టరు: నువ్వూరుకో అబ్బాయ్! రోగులతో అంత గట్టిగా అరుస్తావేం? తాతగారూ! ఏం ఫర్వాలేదు. రంగనాథం చేయవలసిన ప్రయత్నమంతా చేస్తూనే వున్నాడు. తొందర్లో జరిగిపోతుంది లెండి. మీరేమీ మనస్సుకు కలత పెట్టుకోకండి; జబ్బు యింకా అధికమౌతుంది.

ముస: అయితే అవుతుంది. నేనెప్పటికైనా రాలిపోవల్సినవాడినేగా!

గోపి: ఇప్పుడేపోతే ఎవరికీ ఏ బాధ వుండదు.

ఇల్లాలు: ఏమిటి నాయనా పెద్దాయనన్నలా అనొచ్చా?

డాక్టరు: ముసలివాళ్ళను చూస్తే కుర్రాళ్ళ కలా అనిపిస్తుందమ్మా!

గోపి: ఏం చేయమంటారండీ? ఏ లక్షాధికార్లకో రావాల్సిన సమస్యలూ, జబ్బులూ మాకే రావాలి?

ఇల్లాలు: ఏంచేస్తాం బాబూ! విధి.

గోపి: విధి? విధట. పచ్చడిమెతుకులు తిని ఆ పర్చీల కంటుకుపోయి గుమాస్తాచాకిరి చేస్తే వచ్చిందీ రోగం. రవంత మంచి తిండికే నోచుకుంటే ఎందుకొస్తాయి యిన్ని రోగాలు?

ఇల్లాలు: దాని కాయన్నంటే ఏం లాభం బాబూ!

గోపి: ఎవర్నీ ఏమీ అనడంలా? మన బ్రతుకులకు ఏడుస్తున్నా. (అంటూ ముసలాయన ప్రక్కన కూలబడ్డాడు.)

డాక్టరు: (నిట్టూర్పు వదిలాడు.)

ముస: (గోపి వీపుమీద మెల్లగా నిమురుతు) అవున్నాయనా! ఏడుస్తున్నారు. నేను చేసిన పాపానికి మీరందరు ఏడుస్తున్నారు. అవును డాక్టరుగారూ! ఏమేమో చెప్పాలని వుంది. చెప్తాను వింటారా? వినండి. మీరన్నా వినండి.

డాక్టరు: అబ్బ మీరేమీ చెప్పనక్కర్లేదు. వూరుకోండి.

ముస: అది కాదు. వాణ్ణి చూడండి. ఈ వయస్సులో వాడికి బ్రతుకుమీద ఇంత అసహ్యం కలిగిందంటే ఎవరు కారణం? నేనే! ఆ అమ్మాయిని చూడండి. ఈ వయస్సులో అలా పాలిపోయిందంటే ఎవరు కారణం? నేనే? అవును నేనే!

డాక్టరు: మీరేం కాదు. బాధపడకండి వూరుకోండి.

ముస: ఉన్నాలేకున్నా, తిన్నా పస్తున్నా. వాణ్ణి, పెద్దవాణ్ణి చదివించేటప్పటికే నా శక్తంతా వుడిగిపోయింది. పెళ్ళాం మెడలోవున్న చివరి నగదాకా అమ్మి చది

Akella Raghavendra's Online-ias.com

వించాను. ఆ వచ్చే ఏభయి రూపాయలతో అంతకన్నా ఏం చేయను? నా కర్మకాలి అంత చదివినా వాడు మళ్ళా నాలాగే గుమాస్తా కావల్సివచ్చింది. వచ్చేచెడి యాభయిరూపాయిలూ తెచ్చుకొనే గతే పట్టింది. ఆ పెద్దపిల్ల పెళ్ళి కోసం నా పెన్షన్ కూడా అమ్ముకున్నాను. అందుకూ నేనే కారణం? నేనే!

గోపి: నాన్నా....ఊరుకో నాన్నా!

మున: మీ అన్నయ్య ఎందుకు గుమాస్తా అయ్యాడో తెలుసట్రా? వాడికి బతుకంటే ఏమిటో తెలియని వయస్సులోనే పెళ్ళిచేశాను. నేను మూలబడ్డాను. సంసారం వాడి నెత్తిన వేశాను. అందుకే గుమాస్తా అయ్యాడు.

డాక్టరు: ఇప్పుడేం మునిగిపోయింది? ఊరుకోండి.

మున: వీడి చదువు చిన్నపిల్ల పెళ్ళి (భోరున ఏడుస్తున్నాడు).

డాక్టరు: తాతగారూ ఊరుకోండి.

గోపి: (వాస్త తలకిందులయ్యాయి) రామ రామ! నరకంరా బాబూ నరకం! (వెళ్ళాడు).

మున: (గోపీ వెళ్ళడం చూచి) వాడినేమీ అనకండి. వాడేం చేశాడు? అసలే వాడు కుంగిపోతున్నాడు.

డాక్టరు: ఇదిగో తాతగారూ! నా మాట వింటారా! లేదా! చీటికిమాటికి మనసు కలత పెట్టుకుంటూంటే లాభంలేదు. మీరిలాగే వుంటే నేనొక్కడ్నీ ఏమాటకూడ వైద్యం చేయదలచుకోలేదు. అంతే (ఈ మాటంటూండగా రంగనాథం వచ్చాడు. చేతిలో ఆఫీస్ ఫైల్స్ కట్టకట్టి వుంది.)

రంగ: నమస్కారం డాక్టరుగారూ!

డాక్టరు: నమస్కారం (తిరిగిచూచి) ఓ నువ్వాటోయ్! నీకెన్నిసార్లు చెప్పాను; యీ మర్యాదలూ, గార్లూ, మానుకోమని?

రంగ: ఎంత క్లాసుమేట్లయినా నువ్వొక లీడింగ్ డాక్టరువి. నేను గుమాస్తానేగా?

డాక్టరు: గుమస్తా ఏమిటి? నువ్వూ ఒక ఆఫీసరువి. ఆఫీసరేకన్నా యింకా పెద్ద పేరు. నాన్‌గజెటెడ్ ఆఫీసరువి.

రంగ: ఆఁ. ఆఫీసర్నే! ఇదిగో మా ఆఫీసరుతనం (ఫైల్స్ చూపించి) హోం వర్కురా బ్రదర్. స్కూలు కుర్రాళ్ళకన్నా అన్యాయం. పగలల్లా చచ్చింది గాక. యింటికొచ్చినా యిదేకంపు. ఎందుకులే మా బ్రతుకులు; శత్రువుకు కన్నా వద్దు.

Akella Raghavendra's Online-ias.com

డాక్టరు: ఈ రోజులలో తన బ్రతుకుతో విసుగుపడని మానవుణ్ణి చూపించు చూద్దాం.
రంగ: నిజమే! బ్రతుకు కంటే, కలిగినవారికీ లేనివారికీ అంత బరువూ, బాధ అయిపోయింది! ఎంతసేపయిందేంటి నువ్వొచ్చి.
డాక్టరు: గంట.
రంగ: అలాగా! ఏమే? డాక్టరుగారికి కాఫీ ఏమన్నా ఇచ్చావా?
ఇల్లాలు: (ఏం చెప్పాలో తెలియక నసుగుతుంది)
డాక్టరు: అక్కర్లేదు లేవోయ్!
రంగ: వారలాగే అంటూంటారు. ఇవ్వవే! ఇవ్వు!
డాక్టరు: ఎందుకోయ్ ఈ వేళప్పుడు కాఫీ? అక్కర్లేదమ్మా వూరోక్కోండి.
రంగ: సరేగాని - ఏమిటి ఏదో పెద్దగా అరుస్తున్నావు?
డాక్టరు: ఎప్పుడు?
రంగ: నేను వచ్చేటప్పటికి.
డాక్టరు: అసలు నీతో చాలా చాలా మాట్లాడాలి రంగా! వుండు వస్తా, (ముసలాయనతో) తాతగారూ! లేవండి వెళ్ళి పడుకుందురు
ముస: రంగడు వచ్చాడా?
డాక్టరు: ఆ(.
సీత: (మంచినీరు యిస్తుంది. రంగనాధం త్రాగుతాడు)
ముస: దాని విషయం - సూళ్ళూరుపేటలో ఏదో సంబంధం - ఒరే.
డాక్టరు: నేనంతా మాట్లాడతాగా మీరెళ్ళి పడుకోండి.
రంగ: (నాన్నతో) అలాగే నాన్నా! తొందరలో ఏర్పాటు చేసేద్దాం. రామశాస్త్రిగారు చెల్లెమ్మను చూడ్డానికెళ్ళారు. ఇప్పుడే వస్తారు. అన్నీ మాట్లాడుదాం.
ముస: రామశాస్త్రిగారబ్బాయట్రా! ఏమన్నా చదువుకున్నాడా?
రంగ: ఆ( - బి.ఏ. చదువుతున్నాడు.
ముస: మంచి సంబంధంరా! కానివ్వండిరా! దాని కా మూడు ముళ్ళు పడిందనిపిస్తే-
డాక్టరు: అలాగేలెండి. మీరెళ్ళి పడుకోండి (రంగనితో) నువ్వుండు నే పడుకోబెట్టొస్తా.
రంగ: నీ కెందుకులే ఆ కష్టం.
డాక్టరు: షటప్. పతిలేకపోతే సరి (ముసలాయన్ని పట్టుకొని వెళ్ళాడు)
రంగ: ఏమే కాఫీ పెట్టావా? (ఇల్లాలి ముఖంచూచి) పాలు లే వేంటి?
ఇల్లాలు: అసల్దే లేదు.

Akella Raghavendra's Online-ias.com

రంగా: కాఫీపొడా? పోనీలే! వూర్కో. నేనేదో దర్జాగా అనేశాను.

ఇల్లాలు: ఈ దర్జాలకేం తక్కువ మనకు!

రంగ: సరేగాని....గోపీ ఎక్కడ?

ఇల్లాలు: ఇప్పుడే ఎక్కడికో వెళ్ళాడు.

రంగ: ఈరోజు కాలేజీకి వెళ్ళలేదు కమా?

ఇల్లాలు: మీరేమో డబ్బుపంపిస్తామన్నారట. కాచుకున్నాడు.

రంగ: ఊఁ డబ్బు ...డబ్బు...

డాక్టరు: (వచ్చి) పిల్లలేడుస్తున్నారు; వెళ్ళి చూడమ్మా!

ఇల్లాలు: చిన్నవాడిని చూస్తారాండీ?

డాక్టరు: నేను అక్కడికి వస్తాలే అమ్మా. వాణ్ణి ఈ పొగలోకి తీసుకురాకండి.

రంగ: చిన్నవాడి కేమిటి?

ఇల్లాలు: రెండురోజులుగా జ్వరం వస్తూందని చెప్పానే, ఏమని అడుగుతారేంటండీ? చూశారా! ఆఫీసుకెళ్తే ఇంటి విషయం పూర్తిగా మరచిపోతారు.

రంగ: ఓ. .అదా! యింకా తగ్గలేదూ?

డాక్టరు: ఎలా తగ్గుతుందిరా? వూర్కే దబాయిస్తున్నావ్! నువ్వెళ్ళమ్మా!

ఇల్లాలు: (వెళ్ళింది)

డాక్టరు: ఇదిగో రంగా, నీతో కొన్ని విషయాలు మాట్లాడదలచుకున్నాను. నువ్వు చదువూసంధ్యాలేని బ్రూట్‌లా ప్రవర్తిస్తే లాభంలేదు.

రంగ: ఏమిట్రా నామీద దండయాత్ర మొదలెట్టావ్?

డాక్టరు: దండయాత్రే! ఆవిడ ఆరోగ్య మేమన్నా ఆలోచిస్తున్నావా నువ్వు? రోజు రోజుకీ ఆవిడలో అలా నెత్తురు చచ్చిపోతుంటే బ్రూట్‌లా నువ్వు. ......

రంగ: నన్నేం చెయ్యమన్నావ్?

డాక్టరు: వారంరోజులైంది టానిక్కు రాసిచ్చి. ఇంతవరకు నువ్వా విషయం ఏమన్నా పట్టించుకున్నావ్? కనీసం మంచి ఆహారమన్నా యిప్పించావా ఆవిడికి పాలు....పండ్లు ..

రంగ: ఆగరా బ్రదర్

డాక్టరు: ఏమిటి ఆగరా? ఈ డంజన్‌లో పడేసిపెడితే ఇరవైనాలుగు గంటలూ, ఆ పిల్లలూ - ఆవిడ - ఏం కావాలని? ఆ ముందు మురుక్కాలవ నీ ముక్కుల కెప్పుడన్నా తగులుతుందా?

Akella Raghavendra's Online-ias.com

రంగ: ఆగరా తమ్ముడూ. ఆగు! ఇంతకన్నా మురుక్కాలవలు చూశాను. ఇలారా (కిటికీలోనుంచి బయటకు చూపుతూ) అవేమిటో చూశావా? గుడిసెలు! అందులో మనలాంటి మనుష్యులే కాపురముంటున్నార్రా భాయ్? అక్కడికెళ్ళి వుంటే వాళ్ళ ఇంటి చుట్టూ, కాదు. ఇల్లూ - వళ్ళూ అంతా మురుక్కాలవే తెలుసా! ఏం చేస్తాం బ్రదర్! ఇలా నూటికి తొంభైమంది బ్రతుకుతున్నారు. ఏమంటావ్?

డాక్టరు: ఏడ్చినట్లుంది! రాజకీయాలు ఏ కరువు పెడుతున్నావే? వాళ్ళను చూసి తృప్తిపడతావా?

రంగ: లేదురా బాబూ, లేదు. తృప్తిపడితే ఎంతో బాగుండేది. అదీలేదు. ఇలా రా (వాకిలివైపుకు తీసుకెళ్ళి ఎదుటకు చూపుతూ) ఆ కోటీశ్వరుడి బంగ్లాచూసి అసూయపడతాను. ఈ పూరి పాకను చూసి గర్వపడతాను. ఆ కోటీశ్వరుడి స్థాయిలో బ్రతకాలని ఉబలాటపడతాను. ఈ పూరిగుడిసెలో వాడు నాలా బ్రతికితే ఓర్వలేను. ఆ బంగ్లా ___ ఈ పూరిపాక వీటిమధ్య అడకత్తెరలో పోకలా నలిగిపోతూన్న బ్రతుకురా బాబూ! మనది.

డాక్టరు: బాగానే వుంది వుపన్యాసం అయితే ఆవిడా ఆ పిల్లలూ ఇలా అనారోగ్యంగా...

రంగ: మరి మీ రెందుకుండడం? మే మారోగ్యంగా వుంటే మీ బ్రతుకేం కావాలి?

డాక్టరు: ఫర్వాలా! అన్నదమ్ములిద్దరూ ఒకటే ప్రశ్న అడిగారు. మాకోసం మీ రీ అనారోగ్యం తెచ్చుకుంటున్నారన్నమాట.

రంగ: మీకోసం కాదు. వీలులేక. గతిలేక; నా సంపాదనెంతో తెలుసా?

డాక్టరు: ఊఁ... షుమారు యెనభయి!

రంగ: ప్రభుత్వం నేటి పరిస్థితుల నాలోచించి, కనికరించి యిచ్చే డియర్‌నెస్ అలవెన్సుతో కూడా! అందులో ఈ ఇంటికి - దీన్ని నువ్వు ఇల్లని ఒప్పుకుంటావో లేదో నీ ఆరోగ్యశాస్త్ర ప్రకారం...

డాక్టరు: పశువుల పాకని కూడా ఒప్పుకోను!

రంగ: సరే! నువ్వు ఒప్పుకుంటే ఏం! కార్పరేషన్ ఒప్పుకున్నది. ఇల్లుగలాయన ఒప్పుకున్నాడు. ఉన్న మేమూ ఇల్లనే చెప్పుకుంటున్నాం! అది అలా వదిలే! యీ ఇంటికి 30 రూపాయలు అద్దె. మిగతా ఎంత వున్నదిరా బ్రదర్?

డాక్టరు: ఊఁ...!

Akella Raghavendra's Online-ias.com

రంగ: ఊఁ అంటావేం? ఆరోగ్యశాస్త్రానికి అర్థశాస్త్రంతో పనిలేదేం? ఊర్కే నీవీ ఆరోగ్యసూత్రా లేకరువు పెడితే సరిపోయిందా? రూపాయలూ, అణాలూ, పైసల్లా బ్రదర్ బ్రతుకంటే వేరింకేంవాదు!

డాక్టరు: అయిందా నీ సిద్ధాంతాల వర్షం?

రంగ: సిద్ధాంతాలు కావు, అనుభవాలు!

డాక్టరు: ఇక నేను మాట్లాడవచ్చా?

రంగ: స్వతంత్ర భారతదేశంలో వాక్స్వాతంత్ర్యం సంపూర్ణంగా వుంది.

డాక్టరు: ఆర్డినెన్సులు కూడా వున్నాయ్!

రంగ: అవి నేను ప్రయోగించనని హామీ ఇస్తున్నాగా!

డాక్టరు: రక్షించావ్? సరే, నే నొకటే ప్రశ్న అడుగుతాను.

రంగ: నేనూ ఒకటే జవాబు చెప్తాలే!

డాక్టరు: ఈ పరిస్థితుల్లో నువ్వింందరి పిల్లల్ని కనడం దేనికిరా? నే నేం వేళాకోళంగా చెప్పడంలా! పోషించే తాహతులేనప్పుడు పిల్లల్ని కనడం మానెయ్యాలి!

రంగ: అది నా చేతుల్లో వుందా?

డాక్టరు: పిల్లల్నికని ఈలా గాలికి పారేయడం మాత్రం నీ చేతుల్లోవుందా? మతిలేక పోతే సరి. వాళ్ళ నేమాత్రం ఆరోగ్యంగా పెంచగలవు. అసలు తల్లి-తండ్రి మీ రారోగ్యంగా వుంటేనా? వాళ్ళకేం చదువులు చెప్పించగలవ్? వాళ్ళ కేం జీవనోపాధి చూపించగలవు? రేపు వాళ్ళు నీ ప్రాణానికి వుసూరుమంటూ ఈ వెధవ బ్రతుకు ఎందుకురా అని ఏనుయ్యో గొయ్యో చూచుకోటానికా? అసలు వాళ్ళు దేశాని కేవిధంగా వుపయోగపడగలరోయ్!

రంగ: అదిగో! ఆ విషయం నన్నడుగుతావేం?

డాక్టరు: ఏం!

రంగ: దేశం? దేశాన్ని నడిపించేవాళ్ళ నడగవోయ్ దేశాన్ని పరిపాలించే వాళ్ళ నడుగు. దేశాన్ని వుద్ధరించాలని కంకణం కట్టుకున్నారే వాళ్ళనడుగు. దేశంకోసం కాదు నేను పిల్లల్ని కనడం - దేశాని కుపయోగపడితే నాకేం - పడకుంటే నాకేం? దేశమట దేశం! ఎక్కడుందోయ్ దేశం? పార్టీల్లో వుంది - పదవుల్లో వుంది. ఓట్లకు పరుగెత్తేటప్పుడుంది. వుపన్యాసాలలో వుంది.

గోపి: "తిండిగలిగితే కండకలదోయ్
కండకలవాడేను మనిషోయ్
దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్!"

(పాడుకుంటూ వచ్చాడు. చేతిలో ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ ఉంది)

డాక్టరు: ఏం? సంగీతం ఎక్కువవుతూందే?

రంగ: చదువూ సంధ్యా పోతుంది గనుక!

గోపి: ఆ సంగీత మన్నా సరిగ్గా అబ్బితే బాగుండేది. ఏ సినిమాలోనో "ప్లేబ్యాకు" అన్నా పాడి నాలుగురాళ్ళు తెచ్చుకోవచ్చు.

రంగ: ఎందుకునాయనా అంతయాష్ట? ఏమిటి నువ్విప్పుడు బండలు మోస్తున్నది?

గోపి: అదెలా చేస్తాం? మన గౌరవానికి లోపం!

రంగ: ఏడ్చావులే.

ఇల్లాలు కంగారుగా పరుగెత్తు కొచ్చింది.

ఇల్లాలు: డాక్టరుగారూ! డాక్టరుగారూ!

డాక్టరు: ఏమమ్మా ఏం?

రంగ: ఏమిటే?

గోపి: వదినా - ఏంటది?

ఇల్లాలు: పిల్లాడు - పిల్లాడు.

రంగ: ఏం - ఏమిటే?

ఇల్లాలు: దగ్గుపోర విపరీతంగా వచ్చింది. పిల్లాడు వూపిరితిరక్క అల్లాడిపోతున్నాడు. ఆయాసం అధికమైంది. కళ్ళు తేలవేశాడు ఆ ప్రక్కయింట్లో..........

డాక్టరు: ఆఁ-పదమ్మా-పద. (అందరూ వెళ్ళారు)

ఒక్కక్షణం తరువాత

రంగ: (తిన్నగా వచ్చి మంచంమీద కూలబడి ముఖం చేతులో కప్పుకొన్నాడు)

డాక్టరు: (చేతులు తుడుచుకుంటూ వచ్చి కాస్సేపు అతనివైపు చూచి) ఏమిట్రా అది. నువ్వే ఇలా అయితే ఆడవాళ్ళు మరీ దిగులుపడిపోతారు. కాస్త ధైర్యంగా వుండు.

రంగ: చస్తారన్న చింత నాకెప్పుడూ లేదురా.

డాక్టరు: ఛీ! ఏమిటది?

రంగ: అవును! చస్తే వాళ్ళే సుఖపడతారు!

డాక్టరు: చాల్లే.

రంగ: లేదురా బ్రదర్. నువ్వనట్లు వాళ్ళ నారోగ్యంగానైనా పెంచటానికి నోచుకోని దరిద్రులకు బిడ్డలెందుకు?

డాక్టరు: అందుకని వాళ్ళని చంపుతావా?

రంగ: కాదు. బ్రతికించాలనే, ఏం చేయను? ఇప్పటికే చుట్టూ అప్పులు పాపాల్లా పేరుకున్నాయి. బ్రదర్! నీకు తెలీదు రెండు నెలలద్దె ఇవ్వాలి. పాలమనిషి కివ్వాలి. వాడికి కాలేజీ జీతం కట్టాలి. ఎంతని చాపమంటావ్? ఇంకా సంపాయించే అవకాశముంటే ఇరవైనాలుగు గంటలూ చాకిరీచేస్తా, చస్తా కావాలంటే! వాళ్ళు - ఆ పిల్లలు - బ్రతికితే చాలు.

డాక్టరు: సరేలే! పిచ్చిపిచ్చిగా ఆ ఇల్లాలిముందు వాగకు. మందు పంపుతా. ఏం ఫరవాలేదులే-సరేనా?

రంగ: ఊఁ!

డాక్టరు: (వెళ్ళాడు)

గోపి వచ్చాడు. రంగనాథం పొంగివస్తూన్న దుఃఖంతో అతన్ని చూచాడు.

గోపి: ఏం ఫర్వాలేదులే. అన్నయ్యా-నెమ్మదిగా వుంది.

రంగ: (కాస్త దుఃఖం మింగుకొని) కాలేజీ కెళ్ళలేదుగదరా.

గోపి: లేదన్నయ్యా!

రంగ: జీతం కట్టాలిగా?

గోపి: అవును.

రంగ: (ఒక్క క్షణం ఆలోచించి) మీ వదిన్ను అడిగి దాని పెట్టె తాళంచెవి పట్రా-

గోపి: ఎందుకన్నయ్యా?

రంగ: దాని బంగారం గొలుసు ఒకటి మిగిలిందేమో ...దాన్నెక్కడన్నా తాకట్టుపెట్టి తెస్తా. .ఇంకేం చేద్దాం.

గోపి: అక్కర్లేదన్నయ్యా!

రంగ: ఫర్వాలేదు - పో!

గోపి: ఆ గొలుసు అసలులే దన్నయ్యా.

రంగ: ఏమైంది?

గోపి: ... ..... .......

రంగ: ఏమైందిరా?

Akella Raghavendra's
Online-ias.com

గోపి: ఏదో ఎక్కడో తెలిసినవాళ్ళదగ్గర తాకట్టు పెట్టేసింది.

రంగ: ఎందుకు?

గోపి: పోయినెన్నెలంతా గడిపింది కదన్నాయ్యా!

రంగ: ఊఁ అదీ తీరిపో యింది? - (నిట్టూర్చి కూలబడ్డాడు.)

కాంపౌడరు ఒక మందుసీసా, కవరు తెచ్చియిచ్చాడు.

కాం: డాక్టర్‌గారూ ఇవ్వమన్నారండి.

గోపి: ఏం టన్నయ్యా?

రంగ: డాక్టరుగారు డబ్బుకూడా పంపారు. తాటిచెట్టు ఎక్కేవాణ్ణి ఎంతదూరం అని ఎగదోయగలరు? ఇప్పటికి ఆయన చేస్తూన్న యీ సహాయం చాలదూ! ఇంకా ఋణంకూడానా! తీసుకెళ్ళి ఇచ్చే గోపీ! (రంగనాథం కవరు గోపీకి ఇచ్చాడు)

బయటనుండి "రంగనాదం" అని కేక

రంగ: (దగ్గరగా) ఎవరు?

(బయట)... నేను రామశాస్త్రిని.

రంగ: (వాకిలిదాకా వెళ్ళి) ఓ! మీరా! దయచేయండి. దయచేయండి.

శాస్త్రిలోనికి వచ్చాడు.

రంగ: కూర్చోండి ఎప్పుడు రావడం?

శాస్త్రి: ఈ బండికే వచ్చా.

రంగ: ఊఁ ఏమే - శాస్త్రిగారు వచ్చారు. ఊళ్ళో అందరూ కులాసా?

శాస్త్రి: ఆ. .అందరూ కులాసాగానే ఉన్నారు. మీ మేనమామ మిమ్మల్ని చాలా విచారించారు. చాలా యోగ్యుడండి, పాప! ఎంత మర్యాద? ఎంత ఆప్యాయత! ఇదిగో మీ మేనమామగారు ఇచ్చిన ఉత్తరం.

రంగ: ఊఁ రానీండి! కాళ్ళు కడుక్కోండి, ఏమే నీళ్ళు పట్రా?

శాస్త్రి: అయింది. భోంచేసి వచ్చాను. అక్కర్లేదమ్మా.

రంగ: ఎక్కడ భోంచేశారు?

శాస్త్రి: ఇంటికెళ్ళి, స్నానం సంధ్య చేసుకొని భోంచేసి వస్తున్నా.

రంగ: అలాగా! ఊఁ! ఏమిటి విశేషాలు?

శాస్త్రి: విశేషాలకేమున్నాయ్!

రంగ: అమ్మాయిని చూశారా?

శాస్త్రి: బాగుంది. వెళ్ళిందెందుకు మరి? అబ్బాయినికూడా తీసుకెళ్ళాను.

Akella Raghavendra's Online-ias.com

రంగ: ఊఁ ___

శాస్త్రి: అబ్బాయిని అమ్మాయి - అమ్మాయిని అబ్బాయి చూచుకొన్నారు. ఇద్దరికీ సమ్మతమైనట్టే వుంది.

రంగ: శుభం!

శాస్త్రి: మరి - నాన్నగారెక్కడ?

రంగ: అదిగో... పడుకున్నారు. గోపీ ..నాన్నతో వెళ్ళి చెప్పరా; శాస్త్రిగారొచ్చారని.

శాస్త్రి: ఎందుకూ, మనమే అక్కడికు వెళ్ళి మాట్లాడుదాం.

రంగ: అక్కర్లేదులెండి. నాన్నే ఇటొస్తారు. వెళ్ళి తీసుకురారా.

గోపి వెళ్ళాడు.

రంగ: నాన్నగారి కదొక్కటే చింతై పోయింది.

శాస్త్రి: అవును పాపం! పెద్దవారై పోయారు. ఆ అమ్మాయి పెళ్ళి కాస్త అయి పోయిందనిపిస్తే.... ...

రంగ: తొందరపడితే అవుతుందా? కాలం కలిసిరావద్దూ!

శాస్త్రి: అదీ నిజమే.

గోపి ముసలాయిన్ని పట్టుకొచ్చి మంచంమీద కూర్చోపెట్టాడు.

రంగ: నాన్నా....రామశాస్త్రిగారు.

ముస: శా ...శాస్త్రిగారా! ఎప్పుడొచ్చారు.

శాస్త్రి: ఈరోజే వచ్చాను. మీ ఆరోగ్యం ఎలావుంది?

ముస: (ఎలావుంటే ఏమన్నట్లు చేవూపి) చాలా సంతోషం. చిన్ననాటి స్నేహం బాంధవ్యం కూడా అవుతుంది. శుభస్య శీఘ్రం. ఏదో అయిపోయిందని పించండి. అదీ ఒక ఇల్లాలై ....ఊఁ - అమ్మాయిని చూచారా?

శాస్త్రి. ఆఁ అబ్బాయికి కూడా చూపించాను.

ముస: ఊఁ - ఇంకేం? ముహూర్తం చూడండి. ఏమంటారు?

శాస్త్రి: మాదే మభ్యంతరముంది?

రంగ: మరి మాదేనా అభ్యంతరం?

శాస్త్రి: అంతేగా!

రంగ: అంటే?

శాస్త్రి: అబ్బాయి విషయం కాస్త ఆలోచించండి.

Akella Raghavendra's Online-ias.com

రంగ: అబ్బాయి విషయం అంటే?

శాస్త్రి: వాడికింకా పై చదువు చదవాలని వుందట.

రంగ: అయితే యిప్పుడల్లా పెళ్ళి చేసుకోడా?

శాస్త్రి: అదికాదు. మాకేమో ఇంకా వాణ్ణి చదివించే అవకాశం లేదు. ఇప్పటికే చాలావరకు సంసారం వాని చదువుకని చితికిపోయింది. అసలు వాడు పెళ్ళే అక్కర్లేదంటున్నాడనుకోండి.

గోపి: అలా అయితే అతణ్ణి అనవసరంగా శ్రమ పెట్టకండి పాపం!

రంగ: అది సామాన్యంగా కాలేజీ కుర్రాళ్ళందరూ అనేమాటే లెండి. పెళ్ళక్కర లేదనడం అదొక ఫ్యాషనైపోయింది.

శాస్త్రి: వా డొకటే పాయింటు చెప్తున్నాడండి. నా పైచదువు సాగే అవకాశ మేమన్న ఉండేట్టయితే ...

రంగ: అంటే మీ అభిప్రాయం?

గోపి: అభిప్రాయాని కేముంది? ఆ చదువుక్కావలసిన డబ్బంతా మనం ఇచ్చు కోవాలి. అంతేగదండీ?

మున: గోపీ! నువ్వూరుకో! నీ కెందుకు?

శాస్త్రి: వాడనుకునే చదువంతా సాగాలంటే కనీసం పదివేలన్నా కావాలి.

గోపి: ఇంతవరకు అతని చదువుకు మీరు పెట్టిన పెట్టుబడి ఇవ్వనక్కర్లేదాండి.

రంగ: గోపీ!

శాస్త్రి: ఏలాగైనా మీ పిల్లకు మీరు పెడుతూన్నట్టేగదండి? రేపు వా డేపెద్ద వుద్యో గమో చేస్తే మీ అమ్మాయేగా సుఖపడేది!

గోపి: అవునవును; మీ పిల్లాడేం సుఖపడడు.

మున: ఒరే! నువ్వూరుకో! పెళ్ళవతలకి!

గోపి: మీరు ఎక్కడనుంచి తెచ్చిస్తారో తీసుకొచ్చి సమర్పించండి కట్నం....నా కెందుకు?

శాస్త్రి: ఊరుకో బాబూ....అంత వుడుకుండకూడదు....?

గోపి: ఆఁ....

రంగ: శాస్త్రిగారూ! నా మాట వినండి. మా స్థితిగతులు మీకు తెలియంది కాదు. మీరే బాగా ఆలోచించండి! తరువాత మీ యిష్టం.

గోపి: శాస్త్రిగారూ! ఎక్కడన్నా ఒక బ్యాంకి చూడండి!

శాస్త్రి: దేనికి?

Akella Raghavendra's Online-ias.com

గోపి: అమావాస్య పూటగా బయల్దేరుదాం. కొల్లగొట్టడానికి.

మున: ఒరే - పెద్దాయనతో ఏమిట్రా ఆ పరిహాసాలు?

గోపి: పరిహాసాలుకావు. మరి ఆయన మాట్లాడేదేంటి! పరిహాసంకాకుంటే మనపిల్లే సుఖపడుతుందట. సుఖపడుతుంది.

శాస్త్రి: పిల్లంటే పిల్లాడు పిల్లాడంటే పిల్లేగా! వాళ్ళిద్దరు భార్యాభర్త లైంతర్వాత?

గోపి: అప్పుడు మీ పిల్లాడేలా భర్తవుతాడండీ? మా పిల్ల భర్తవుతుంది.

రంగ: ఒరే! నిన్ను మాట్లాడొద్దన్నానా?

గోపి: అవునన్నయ్యా! అక్కయ్యే భర్తవుతుంది. భరించేవారు భర్త....భరించబడే వారు భార్య. మనం పెట్టుబడిపెట్టి ఆ పురుషుణ్ణి చదివించి. ఇంకా అక్కయ్య భార్యనిపించుకోవలసిన కర్మేమొచ్చింది?

శాస్త్రి: మరీ విడ్డూరంగా మాట్లాడుతున్నాడే అబ్బాయి.

గోపి: విడ్డూరమేముంది! యధార్థం.

మున: శాస్త్రిగారూ! ఆ పిల్లకుంకతో ఏంటిలెండి? మనిద్దరం చిన్నతనంలో ఒకటిగా అధ్యయనం చేసుకున్నాం. మంచి సాంప్రదాయిక కుటుంబాలు. చిన్ననాటి స్నేహం వృధాపోనివ్వకండి....నామాట కాస్త మన్నించండి, నే నేమో కాటికి కాళ్ళు చాచుకున్నాను! దానిమెళ్ళో ఆ మూడుముళ్లూ పడితే హాయిగా కళ్ళు మూసేస్తాను. నన్ను చూచన్నా మీరు....

శాస్త్రి: చూడండి, మీరింతగా చెప్పాలా! నాకేమీ అభ్యంతరంలేదు. అమ్మాయి రత్నంలాంటిది. ఇంటికి మహాలక్ష్మి వచ్చినట్లే....కానీ, అబ్బాయి మరీ మొండిపట్టు పడుతున్నాడు. ఎంత చెప్పినా వినడంలేదు; మనవాళ్ళురా; మంచి సంబంధంరా, అని ఎంతో చెప్పాను.

మున: నామాట వినండి. వాడు-వాడొక్కడూ నానా అగచాట్లుపడి నాలుక్కాసులు తెచ్చిపేస్తుంటే యీ సంసారం గడవడమే కష్టంగా వుంది? మీకు తెలియంది కాదు. నేను. .నేను వాళ్ళకు పెట్టిందేమీ లేదు. లెక్కలాడితే వుంది, లేకుంటే లేదు. ఈ స్థితిలో...

గోపి: నాన్నా మీరు వూర్కోరూ?

మున: మధ్య నీ దేంటిరా?

రంగ: ఏమిటా నైచ్యం? ఎందుకలా ప్రాధేయపడతారు?

మున: నువ్వు నోరుముయ్యి ముందు. శాస్త్రిగారూ! పదివేల రూపాయలు. పదివేలు అడగటం....

గోపి: పదివేలుకాదు-పదిదమ్మిడీలైనా ఇవ్వలేం.

మున: అలాగని ఆడపిల్లకు పెళ్ళిచేయకుండా వుంటావట్రా?

గోపి: వుంటాం. ఏం?

మున: సరేలే నువ్వెళ్ళు.

గోపి: ఏమైనా సరే, కట్నం ఇవ్వటానికి వీల్లేదు. కట్నం కడితే చేసుకునే మగ ధీరుడీయన ఒక్కడేరాడు..

శాస్త్రి: అదే-దీన్ని మీరు కట్నంగా భావిస్తారనే నా భయం. కట్నమెందుకండి.. నీచం?

గోపి: మరి యీ పదివేలను మీ భాషలో ఏమంటారండి?

శాస్త్రి: విద్యకోసం అడుగుతున్నాం. విద్యాహీనులైన పురుషుడు పశువుతో సమానం కాదూ!

గోపి: ఆడదాని ద్వారా డబ్బు సంపాయించేవాడు భోగంవాడు కాడూ.

రంగ: గోపీ .

మున: ఒరే - గోపీ. .

గోపి: అందరికీ కోపాలే పోనీ....నాకెందుకు ఎక్కడనుంచి తెస్తారో; తెచ్చివ్వండి మరి. ఇంట్లో పప్పుగింజలేదు; మంచి గుడ్డపీలికలేదు. వేలువేలు కట్నాలిద్దాం.

శాస్త్రి: అయితే రంగనాథం, ఏమంటావ్?

రంగ: అనడానికేముంది మీకు తెలియందీ. మీరే ఆలోచించండి.

శాస్త్రి: మే మాలోచించే దేముంది. మీరే నిర్ణయించండి. మీ కీ పదివేలేం పెద్దండి?

రంగ: హుం.. మీ కళ్ళకలా అగుపిస్తున్నందుకు సంతోషం.

శాస్త్రి: ఒక్క గుడ్డలవ్యాపారం లైసెన్సులో వస్తుంది 4 వేలు కావాలన్నా.

రంగ: శాస్త్రిగారూ!

శాస్త్రి: (నిర్ఘాంతపోయాడు)

రంగ: అలా అంచనాలువేసే పక్షంలో మీదాకా వచ్చేవాళ్ళం కాము సుమా. మీరు చాలా నీచంగా భావిస్తున్నారు. క్షమించండి.

శాస్త్రి: మీరు చేస్తున్నారని కాదుసుమా. గడించే మార్గం చెప్పాను.

రంగ: చాలా సంతోషం దయచేయండి!

శాస్త్రి: అయితే....మన సంబంధం?

గోపి: ఏమీ అక్కర్లేదు.

Akella Raghavendra's Online-ias.com

రంగ: శాస్త్రిగారూ! నిజం చెప్పాల్సివస్తే ఆ పదివేలురూపాయలు వుంటే మా అమ్మాయినే చదివించి, మీ అబ్బాయి మా అమ్మాయి కాళ్ళచుట్టూ తిరిగేటట్టు చేసుకోగలం. తెలిసిందా?

గోపి: ఇంకా చెప్పాల్సివస్తే, ఆ పదివేలు ఒక యినప్పెట్టెలో పెట్టి మీ అబ్బాయికి బదులు ఆ యినప్పెట్టెకే పెళ్ళి చేసేవాళ్ళం; తెలిసిందా?

రంగ: ఇక మీరు వెళ్ళవచ్చు.

గోపి: దయచేయవచ్చు.

మున: ఒరే! ఒరే! ఏమిట్రా ఆ కూతలు.

శాస్త్రి: సరే. నే వస్తానండీ.

మున: ఛీ నోరుముయ్! శాస్త్రీగారూ-శాస్త్రీగారూ?

శాస్త్రి: (వెళ్ళిపోయాడు)

మున: అయితే ఇంతేనట్రా? అది అలా వుండిపోవల్సిందేనట్రా! ఇంత బ్రతుకు బ్రతికీ ఈ అప్రతిష్ట పడాల్సిందేనా? నేనిలా ఈ చింతతో చావాల్సిందేనా? నా కర్మ! నాకా యోగంలేదు. దాని కా రాతాలేదు.

గోపి: అదికాదు. మనకు గతిలేదు.

మున: ఎక్కడన్నా పోసిపెట్టుంటే మీరొక మొనగాళ్ళు కావాలట్రా?

రంగ: ఎక్కడనుంచి తీసుకరమ్మంటావు - నన్నేం చావమంటావా?

మున: ప్రపంచంలో ఎవరూ పెళ్ళిళ్ళు చేసుకోవడంలా? అందరూ మనలాగే వున్నారా!

గోపి: ఆఁ! పెద్దవాళ్ళు గడించి పోసిపెట్టిన గంటుంది మనకు.

మున: ఆఁ! అవున్నాయనా అవును. నే నేమో గడించి పోసి పెట్టలేకపోయాను. మిమ్మల్ని కన్నాను; పెంచాను. సంసారం మీనెత్తిన వేశాను! జబ్బున పడ్డాను! ఇంకా బతికే వున్నాను. పాపం చేశాను! మిమ్మల్ని అన్యాయం చేశాను. అందుకే....అందుకే నాకు చావైనా రాదు. (అని కూలిపోబోగా గోపీ వచ్చి పట్టుకున్నాడు)

గోపి: నాన్నా! నువ్వెళ్ళిపడుకో! (మెల్లగా తీసుకొని వెళ్ళాడు)

రంగ: (అలా చూస్తూ నిలబడ్డాడు)

ఇల్లాలు: (వచ్చింది) ఇప్పుడే పాలుతాగి పడుకున్నాడు. అబ్బాయికి, ఏం ఫర్వా లేదు.



Akella Raghavendra's Online-ias.com

బయట టపాకాయల శబ్దం

రంగ: ఏమిటది?

ఇల్లాలు: పక్కింటి పిల్లలు టపాకాయలు కాలుస్తున్నారు. దీపావళి వస్తూందిగా!

రంగ: దీపావళి - దీపావళి - పిల్ల లెక్కడ?

ఇల్లాలు: చూస్తూ కూర్చున్నారక్కడ. చివరికి వాళ్ళకొక్క పెట్టన్నా తేసుకరాకుంటే బతకనిచ్చేటట్టుగా లేరు వాళ్ళు.

రంగ: దీపావళికా! మనకేం దీపావళే!

ఇల్లాలు: ఇంట్లో పప్పుగింజ లేదండి.

రంగ: ఊఁ! (జాబుచించి చదువుకుంటున్నాడు)

గోపి: (వచ్చాడు)

ఇల్లాలు: రేపే మీ తాతగారి తిధి.

గోపి: తిధి........! శర్మ అద్దెకోసం పదిసార్లువచ్చి వెళ్ళాడన్నయ్యా.

రంగ: .........

గోపి: వదినకు టానిక్కు తేవాలన్నయ్యా.

ఇల్లాలు: (వద్దని సైగ జేసింది.)

రంగ: దినం గడవనీవోయ్ టానిక్కులకు పోదాం.

ఇల్లాలు: కట్టెలు పూర్తిగా అయిపోయినాయ్. రేపు తెచ్చుకోవాలి.

రంగ: మీ అక్కయ్య వ్రాసిన జాబు చదివ్వినిపించరా మీ వదినెకు.

గోపి: (జాబు చదువుతున్నాడు) "నా విషయం గురించి మీ రూర్కే కలవరపడకండి. కట్నాలకని ఋణాలు చేయకండి. నా కర్మం ఎలాగుంటే అలా జరుగుతుంది. (దుఃఖం పొంగి ముఖం కప్పుకున్నాడు.)

రంగ: డబ్బు - డబ్బు - (ఇటటు పిచ్చిగా తిరిగి) పదండి, పదండి, అందరం ఏకంగా కట్టగట్టుకొని చస్తాం. (కూలబడ్డాడు.)

గోపి: (అక్కడ నిలువలేక వెళ్ళాడు.)

ఇల్లాలు: (రంగనాధాన్ని సమీపించి ఒక్కక్షణం నిలబడి అతన్ని చూస్తూ పొంగి వచ్చే దుఃఖాన్నాపుకొని) ఇటు చూడండి.

రంగ: (తలయెత్తి సీత కన్నీరు చూచి) ఎందుకు కన్నీళ్ళు పెట్టుకుంటున్నావు?

ఇల్లాలు: (దుఃఖం పొంగి చేతుల్తో ముఖం కప్పుకొంది.)

రంగ: ఛీ! ఏమిటది! వూర్కో - ఎందుకు చెప్పు?

ఇల్లాలు: మీ రెందుకు ఆ మాట ఎప్పుడూ వూర్కే అంటుంటారు?

Akella Raghavendra's Online-ias.com

రంగ: ఏ మాట?

ఇల్లాలు: ఆఁ ఊఁ - అంటే చస్తాం చస్తామని!

రంగ: పిచ్చిదానా! ఏదో ఒకనాడు చావక తప్పుతుందా?

ఇల్లాలు: చాల్లెండి, వేదాంతం అలాగని యదాస్తమానం అదే జపమా?

రంగ: అలా జపం చేస్తుంటే చావంటే భయం పోతుంది. అదీగాక మనం ఇప్పుడు బతుకుతున్నామనేగా నువ్వనుకోవడం? కేవలం పొరపాటు. చూడావ్ ఈ భూమిమీద పడ్డ క్షణం నుంచి చావడం మొదలెడతాం. ప్రతి క్షణానికి కొంత చస్తూంటాం. ఆ చావడం ఆగిపోవడాన్నే మనం సామాన్యంగా చావంటాం. నిజంగా ఆ క్షణాన్నుంచే మనం బ్రతకడం మొదలుపెడతాం. చావనేది ___

ఇల్లాలు: అబ్బ! ఇక చాల్లెద్దురూ చావు జపం.

రంగ: సీతా!

ఇల్లాలు: ఏం?

రంగ: (కాస్సేపు ఆమె కళ్ళల్లోకి చూస్తాడు.)

ఇల్లాలు: ఏమిటలా చూస్తున్నారు?

రంగ: (దగ్గరకు తీసుకుని బుగ్గ నిమురాడు. తలమీదనుంచి చెయ్యలాజార్చాడు; ఒక నిట్టూర్పు వదలి.)

ఇల్లాలు: ఏమిటండీ - ఎందుకలా చేతులు వణుకుతున్నాయి. ఏమిటండీ?

రంగ: (చేతులు చూచుకొని) అవును - వణుకుతున్నాయి. సీతా - మన పెళ్ళిరోజు నీకు జ్ఞాపకముందా?

ఇల్లాలు: (సిగ్గు కొంచెం కలిగినా) ఇప్పుడెందుకండీ ఆ విషయం?

రంగ: నీకు జ్ఞాపకముండదు. నువ్వప్పుడు చిన్నపిల్లవి. నే నింకా చదువుతున్నాను. నువ్వారోజు కమ్మగా కష్టాలెరుగని కంఠంతో వీణ మీటుతూ పాడుతున్నావు. విన్నాను. నా కదోలా అనిపించింది. పెళ్ళి చేసుకోవాలనే అనిపించింది. నే నప్పుడు కవిత్వం వ్రాసేవాణ్ణి. నేను పాటలు వ్రాస్తూంటే నీవు పాడుతూ వుంటే యిద్దరం కలిసి ఏదో స్వర్గలోకానికి తేలిపోదామనిపించింది. నాలుగు సంవత్సరాలన్నా కాలేదు. ఆ ఆశలన్నీ పోయినై. నీ కంఠంలో కమ్మదనం పోయింది. నా కవిత్వం నాశనమైంది. బ్రతుకే బండబారిపోయింది.

ఇల్లాలు: ఏమిటండీ! వూర్కోరూ? చూడండి - నాకు భయంగా వుంది.

Akella Raghavendra's Online-ias.com

రంగ. (దగ్గరగా తీసుకొని) సీతా! ఆ బంగ్లా ఆ మూడంతస్థుల మేడ - ఎప్పుడన్నా వెన్నెల్లో చూచావా నువ్వు?

ఇల్లాలు: ఎందుకు?

రంగ: చూచినప్పుడు నీ కేమనిపిస్తుంది?

ఇల్లాలు: బాగుందనిపిస్తుంది.

రంగ: అంతేనా? అలా ఒక్కరోజు - రాము - ఒక్కక్షణం జీవితంలో వుండ గలమా అనిపించదూ?

ఇల్లాలు: బాగుంది; ప్రపంచంలో అందరికీ బంగ్లా లొస్తాయా? అందరూ లక్షాధికార్లవుతారా? వూర్కే ఆశపడితే ఏం లాభం?

రంగ: ఆశ కాదు. బంగ్లాలు, లక్షలూ అక్కర్లా. హాయిగా ఒక్కరోజేనా ఏ చింతా చీకు, లేకుండా వుండే కాలం వస్తుందా. మన బతుకుల్లో. లేదు....సీతా.... లేదు.

ఇల్లాలు: మీరు వూరుకోరూ?

రంగ. సీతా! (వెర్రిగా ఆమెను చూస్తూ చెక్కిలికి చేయి ఆనించి ఒక్కక్షణం ఏదో లోకంలో వున్నాడు. "రా రా" అని ఎనిమిది గంటలు ఠాణాలో కొట్టారు.)

రంగ: (తేరుకొన్నాడు. బయటనుంచి "సార్" అని కేక.)

ఇల్లాలు: ఎవరు?

బయట: అయ్యగా రున్నారా?

ఇల్లాలు: ఏం?

బయట: కలెక్టరుగారు పిల్చుకరమ్మన్నారు. అర్జంటు పనుందట.

రంగ: ఆఫీస్! రాత్రి ఎనిమిది గంటలకు ఆఫీస్. ఏమిట్రా?

బయట: గుడ్డల లైసెన్సులు, సిమెంటు పర్మిట్లు అప్లికేషన్లు పట్టుకొని వెంటనే రమ్మన్నారండీ.

రంగ: సరే ఇదిగో వస్తున్నా. కానీ ...కానీ! నానుగెద్దు గంతకట్టు.

ఇల్లాలు: అదేమిటి?

రంగ: అంటే ఆ కోటు అందుకోమని?

ఇల్లాలు: (కోటు తీసిచ్చింది.)

రంగ: (కోటు వేసుకుంటూ) ఈ కోటెందుకు తగిలిస్తానో తెలుసా?

ఇల్లాలు: ఏమో నాకేం తెలుసు?

రంగ: ఇదిగో - ఈ షర్టు చిరుగు దాచిపెట్టడానికి; ఇదీ మన బతుకు. ఇదే మన గొప్ప - గౌరవం (వెళ్తున్నాడు.)

ఇల్లాలు: (ఆపి) మబ్బులేసుకున్నాయి. వర్షం వస్తుందేమో గొడుగు పట్టుకెళ్ళండి.

రంగ: ఆ గొడుగున్నా ఒకటే లేకున్నా ఒకటే!

జవాన్: (మళ్ళా వచ్చాడు.)

రంగ: ఏమిట్రా?

జవాన్: దయాల్ సేట్ తమకోసం మళ్ళీ పంపినాడండీ. హోల్ సేల్ వ్యాపారం లైసెన్సు కోరుతున్నాడు. మంచీ చెడ్డా తెలిసినవాడు. మిమ్మల్ని అన్యాయం చేయడు. మంచిచెయ్యి యిటువంటి విషయాలలో.

రంగ: సరే పో.

జవాన్: మీకు తెలియం దేముంది? పిల్లాజల్లా గలాళ్ళు. మడికట్టుకు కూర్చుంటే ఏంలాభం చెప్పండి.

రంగ: సరే! నీ కెందుకు? నువ్వెళ్ళు.

జవాన్: (వెళ్లాడు.)

రంగ: పిల్లాజల్లా కలవాణ్ణి. మడికట్టుకు కూర్చుంటే లాభంలేదు.

ఇల్లాలు: ఏమిటండీ!

రంగ: చావాలా బ్రతకాలా అన్నదే సమస్య! లంచం తీసుకోవటం పాపం. చావటం అంతకన్నా పాపం. పిల్లాజల్లా గలవాణ్ణి. మడికట్టుకు కూర్చుంటే లాభంలేదు. (లాంతరు తలకు తగిలి వూగుతూంది. చూచి) అవును మడి కట్టుకు కూర్చుంటే లాభంలేదు. (లాంతరు ఆపాడు; సీత ఆలాగే చూస్తూ నిలబడ్డది.)

గోపీ: (వచ్చాడు.)

హాయి హాయి యీ సంసారం
అప్పుల కుప్పుల సంసారం
హాయి హాయి మన సంసారం
మోటార్ షెడ్డులో సంసారం.

ఇల్లాలు: (నవ్వి) మంచిపాటే కట్టావ్. మీ అన్నయ్యలా నువ్వూ కవిత్వం చెప్తున్నావే.

Akella Raghavendra's Online-ias.com

గోపి: ఇది కవిత్వం కాదు. యథార్థం. ఇప్పుడే బజార్లో విన్నాను గ్రామఫోను రికార్డు; ఎవరో సినిమాలో వ్రాశారు

హాయి హాయి యీ సంసారం
నవ్యమధుర సుఖ సంసారం
హాయి హాయి మన సంసారం
దివ్యమధుర సుఖ సంసారం...

అని. ఇదీ కవిత్వమంటే. ఆ రాసిన కవికి సంసారం అంటే ఏమిటో అంతు పట్టినట్టులేదు.

ఇల్లాలు: అది సినిమా సంసారం మేమోలే.

గోపి: నిజమే! సినిమాలలోగూడా మన ఏడుపుగొట్టు సంసారాలే చూడాలి డబ్బిచ్చి. ఆఁ....ఇదిగో ఆస్పత్రి అంతా తెచ్చాను. ఇది చిన్నవాడికి, ఇది పెద్దవాడికి, ఇది నాన్నకి - ఇది నీకు.

ఇల్లాలు: నా కెందుకు?

గోపి: ఆ కాళ్ళనొప్పులూ అవీ తగ్గుతాయట.

ఇల్లాలు: ఆఁ తగ్గుతాయి! ఇంకొకటే తగ్గటం.

గోపి: చిన్నవాడికట యీ పొట్లం. వెంటనే వేసేయి. నోట్లోవేసి కాసిన నీళ్ళు పోసేయమన్నాడు.

ఇల్లాలు: (ఆ పొట్లాం పట్టుకొని వెళ్తుంది. బయటనుండి గోపి అని కేక)

గోపి: ఆఁ. (వెళ్ళి చూచి) రారా! రా! ఫర్వాలేదు. రా! జాగర్త. అక్కడ మురుగు కాలవుంది. మోటర్ సైకిల్లో వచ్చావా?

బయట: కార్లోనే వచ్చా!

గోపి: చిన్నకారా? పెద్దకారా?

ఒక పత్రవాడు మంచి దుస్తులతో, కాళ్ళకు కళ్ళకు జోళ్ళున్నాయి. క్రాపు నున్నగా దువ్వుకున్నాడు, చేతికి వాచి, మెడలో గొలుసు, వేలికి నైసైన వుంగరం.

కుర్రా: (వస్తూ) ఆస్టిన్ యైట్!

గోపి: టెన్నిస్‌కెళ్ళి వస్తున్నావా?

కుర్రా: ఆఁ! నీ రూమెక్కడా... వంటింట్లోకి తెచ్చావు?

Akella Raghavendra's
Online-ias.com

గోపి: ఇదే నా రూం.

కుర్రా: వంటిల్లా?

గోపి: అవున్రా బ్రదర్. చూకిదే కిచెన్, ఇదే రీడింగురూం, ఇదే బెడ్‌రూం. ఇదే డ్రాయింగ్‌రూం. ఇదిగో ఈ నాల్గు గోడలే ఇల్లంతా.

కుర్రా: ఊఁ. వస్తారా! (ఎప్పుడు వెళ్దామా అని)

గోపి: ఆగరా బ్రదర్! కాస్త వుండు. అంత కష్టంగా వుంచా యిక్కడుండటం?

కుర్రా: గాల్లేదురా!

గోపి: బయటకూడా లేదు. ఉక్కబెట్టేస్తూంది. వర్షం వస్తుందేమో? విసురురా కూర్చో.

కుర్రా: పొగరా?

గోపి: పొయ్యి ఆర్పేస్తాలే. (పొయ్యిలో నీళ్ళు చల్లాడు) ఎక్కడికి వెళ్తున్నావు?

కుర్రా: జిమ్మీ యింటికి.

గోపి: అదెవరు?

కుర్రా: ఏస్ డాన్సర్రా?

గోపి: అయితే?

కుర్రా: మిష్టర్ శేఖర్‌గారు డాన్సు నేర్చుకుంటున్నారు.

గోపి: అదేమిట్రా! న్యూసే! ఇంగ్లీషు డాన్సేనా?

కుర్రా: కాక....? డాం భరతనాట్యం మనుకున్నావా? ఏదో వాసనరా!

గోపి: నీ దగ్గరే.

కుర్రా: నాన్‌సెన్స్.

గోపి. నీదగ్గరేరా అంటే; ముఖం చూటకూరా. ఒళ్ళు యీవినింగ్ యిన్ పారిస్.

కుర్రా: అది కాదురా ఫూల్! ఇక్కడేదో వాసనరా అంటే....

గోపి: వాసనకాదు. కంపు. మురుక్కాలవ వుందిలే.

ఇల్లాలు ఇంట్లోకి వచ్చి ఎవరో వుండటం చూచి తిరిగి వెళ్ళింది.

కుర్రా: వెళ్దాం రారా. నీకేమున్నా పనుందా?

గోపి: నీకొక్కక్షణం ఇక్కడ నిలవాలంటేనే ఇలా వుందే, మేము సంసారమంతా ఇందులో కాపురమున్నాం; ఇంకా వుంటాం కూడా.

కుర్రా: చస్తే వుండలేన్నేను. అసలు నా లెట్రిన్ ఎంత నీట్‌గా వుంటుందో తెలుసా? కొంచెం వాసనేసిందంటే చావబాదేస్తాను నౌకర్లని.

Akella Raghavendra's Online-ias.com

గోపి: మీ నౌకర్ల ఇళ్ళు ఎలావుంటాయో తెలుసా?

కుర్రా: అవెవరిక్కావాలోయ్?

గోపి: అవున్రా అవును! పెద్దవాళ్ళెవరో అన్యాయాలు అక్రమాలు చేసి ఎందరి కడుపులో కొట్టి సంపాయించి పెడితే నేనూ సెంట్లు పూస్తాను. వాస్నెలూ నేరుస్తాను.

కుర్రా: మండిందిరా కడుపు?

గోపి: సరే వూర్కోరా! నన్ను రెచ్చగొట్టావంటే బూతులు మాట్లాడుతా.

కుర్రా: ఏం? ఎందుకు? మిమ్మల్నెవరు సంపాయించవద్దు అన్నారు.

గోపి: శేఖర్! ఇప్పుడు సంపాయిస్తున్నది మీ నాన్న కాడు. మీ నాన్న తెలివి తేటలూ కాదు! డబ్బు. డబ్బు డబ్బును సంపాయిస్తుందీ కాలంలో - అంతే - ఇప్పుడు నువ్వు సుఖపడుతున్నది నీ తెలివితేటలవల్లా, అర్హతవల్లా నీ కష్టమువల్లా కాదు. కేవలం డబ్బుగలవాడివిగా పుట్టినందువల్ల. తెలిసిందా? ఏదీ నాలుగురోజులు నువ్వు లక్షాధికారి కొడుకివి కాననుకొని బయటపడితే తెలుస్తుంది; నువ్వే మాత్రం బ్రతగ్గలవో.

కుర్రా: సరే, నే వెళ్తున్నానురా!

గోపి: ఆగు, కోపం వచ్చిందా? కాస్త నిదానంగా కూర్చొని ఆలోచించు; నీకే తెలుస్తుంది. వున్నదున్నట్లు చెప్పాలంటే నీకన్నా తెలివితేటల్లో నేనేం తీసిపోయాను. నువ్వింకా నాలుగుసార్లు — దండయాత్రలు కొట్టావు యింటర్లో. నేను పాడుతాను. యాక్టర్ని. పెయింటర్ని. ఇన్ని వుండి లక్షలు లేకపోతే లేకపోయె....నిశ్చింతగా బ్రతికే యోగం లేదెందుచేత? చెప్పు! నువ్వు కేవలం లక్షాధికారికి పుట్టినంతమాత్రాన....

కుర్రా: (ఠపీమని గోపిచెంప మోగించాడు.)

గోపి: (ఒక్కక్షణకాలం ఏమీ తోచక స్తంభించిపోయి) కొట్టావట్రా!

కుర్రా: వచ్చేటట్టుంటే రా, డ్రైవింగ్ నేర్పిస్తా (వెళ్ళాడు. ఇల్లాలు వచ్చింది)

గోపి: (లెంపకాయ తడివి చూసుకొంటున్నాడు)

ఇల్లాలు: ఏం? చెయ్యి దురదా అబ్బాయికి? ఎవరితను?

గోపి: నువ్వంతా చూస్తున్నావా వదినా?

ఇల్లాలు: నువ్వేమన్నావని?

గోపి: నిజం చెప్పాను. ఇకముందు వీళ్ళకు పట్టబోయే గతి చెప్పాను. పిత్రార్జితం పెట్టుకొని - హాయిగా బతకొచ్చను కొంటున్నాడేమో! ఇక సాగవా ఆటలు.

Akella Raghavendra's Online-ias.com

ఇల్లాలు: నీకు పిచ్చిపట్టుతుందేం?

గోపి: రానీ వొదినా! వస్తుంది. ఆ కాలం వస్తుంది. పనిచేసే వాడికే తిండి — డబ్బూ — సుఖం వుంటుంది. ఈ సోమరిపోతు వెధవలు —

ఇల్లాలు: ఇక చాల్లే.... ..

గోపి: ఈరోజేమిటో అమితంగా వాగుతున్నావు.

ఇల్లాలు: ఇదిగో ఈలా దెబ్బలు తినడానికే.

బయటనుంచి "రంగనాధంగా"రని కేక

PRESENTED BY Prof. KORLAPATI SRIRAMAMURTHY, D.Litt.

గోపి: ఎవరు?

బయట: నేనేనండి...శర్మను.

గోపి: శర్మో — కర్మో!

ఇల్లాలు: కాస్త నోరు తగ్గించుకో బాబూ! ఆయన లేరండి.

శర్మ: ఏమమ్మా! ఆవైపు వసారా ఖాళీ చేయాలని నాలుగు రోజులైంది చెప్పి. ఇంకా మీరలాగే వున్నారు. పాపం వాళ్ళు తొందరపడుతున్నారు. ఆయనొస్తే కాస్త చెప్పండి.

గోపి: ఏవైపు వసారా ఒదినా?

ఇల్లాలు: ఏమో — నాకేం తెలుసు?

గోపి: ఏమండి శర్మగారూ? ఇలా లోపలికి రండి.

శర్మ: (వచ్చాడు)

గోపి: ఏవైపు వసారాండి?

శర్మ: అదుగో, ఆ ముసలాయన్ను పడుకోబెట్టి వున్నారే అది.

గోపి: అదెందుకు ఖాళీ చెయ్యాలి?

శర్మ: ఎందుకంటే వేరే యింకొకరు వస్తున్నారు అందులో కాపురానికి.

గోపి: వసారాలోనే?

శర్మ: అద్దొరక్క ఎందరు వస్తున్నారు?

గోపి: అదేమిటండీ? ఇచ్చే వాళ్ళకన్నా వుండక్కర్లా ఇంగితం?

శర్మ: తీసుకొనే వాళ్ళున్నప్పుడు యిచ్చేవాళ్ళ కేమొచ్చిందయ్యా?

గోపి: అలాగని వసారాలో కాపురాలు పెడతారా?

శర్మ: మేం పెడుతున్నామా? తలదాచుకోటానికి కాస్తంత నీడలేదండీ, ఏదో కొంచెం చోటివ్వండని కాళ్ళావేళ్లా పడితే ఇంకేం చేస్తాం?

Akella Raghavendra's Online-ias.com

గోపి: అయ్యో పాపం! ఎంత కనికరమండీ మీ గుప్తాగారికి. వాళ్ళను దయతలచి ఆ వసారా యిస్తున్నారన్నమాట. అంతేగాని డబ్బు చేదుకోటానిక్కాదు.

శర్మ: ఇదిగో అబ్బాయి, ఈ వాదన అంతా ఎందుకు నీకూ నాకూ? ఇచ్చేవాడాయన. వుండేవాళ్ళు వాళ్ళు. మధ్య మనకెందుకు?

ఇల్లాలు: దానికి అద్దె ఎంతండి?

శర్మ: ఏ పాతిక రూపాయలో వుంటాయి.

ఇల్లాలు: పాతిక రూపాయలే?

గోపి: మరేమనుకున్నా వొదినా? పట్నంలో ప్రతి అంగుళం రూపాయ కడుతున్నారు. డబ్బు కక్కుర్తికి ఎంత పనన్నా చేస్తున్నారు; సిగ్గూ బిడియం లేకుండా!

శర్మ: అబ్బాయ్! ఎందుకొచ్చింది చెప్పు ఆ నోటి దుడుకు?

గోపి: సరేలేవయ్యా! మహా మాటా నొచ్చావ్? ఎక్కడి న్యాయం యిది. ఈ యింటి వసారా వుంటే వసారా పేరు యిల్లు పేరవుతుందటయ్యా? ఇల్లొకరికిచ్చి వసారా పేరొకరికిస్తారూ? ఇదేనా న్యాయం? ఇదేమంటే నోటి దుడుకంటావ్?

శర్మ: ఇదిగో అబ్బాయ్! నువ్వు కుర్రాడివి. నీతో నాకు మాటలేంటిగాని - మీకు యిష్టముంటే వుండండి. లేకుంటే యీ క్షణం ఖాళీచెయ్యండి. లక్షయాభై మంది వున్నారు. రెడీగా కళ్ళకద్దుకొని చాప్పరం రావడానికి. తెలిసిందా!

గోపి: అయితే వసారా పేరే అంటారు.

శర్మ: అవును.

గోపి: శర్మగారూ! ఇది మీరు మనస్ఫూర్తిగా అంటున్నారా. లేక గుప్తాగారి గుమాస్తాగా మాట్లాడుతున్నారా?

శర్మ: ఇదిగో... అది వేరే విషయం. నా అభిప్రాయాలు వెయ్యుంటాయి. ఒకళ్ళ దగ్గర నౌకరీ అన్న తరువాత వాళ్ళు చెప్పింది చెయ్యాలి...

ఇల్లాలు: అలాగని యింత అన్యాయమటండీ.

శర్మ: ఏం జేస్తాం చెప్పమ్మా.... అలావుంది ఇళ్ళకరువు. నేనొక్క మాటడుగుతా - మీరంతా గవర్నమెంటు వుద్యోగులుకదా? గవర్నమెంటు హాయిగా యిళ్ళు కట్టి మీ కివ్వకూడదూ?

గోపి: ఇవ్వకేం? ఇస్తున్నారు. పెద్ద ఉద్యోగస్తు లందరికి బంగళా లిస్తున్నారు.

శర్మ: వాళ్ళ కెందుకు?

Akella Raghavendra's Online-ias.com

గోపి: ఎందుకంటే అధిక జీతాలు పుచ్చుకుంటున్నారు గనుక. ఇంగ్లీషువాళ్ళే ఏర్పాటుచేసి వెళ్ళారండీ ఈ విధానం. ఎవడికి వేల వేల జీతాలో వాడికే అన్ని అలవెన్సులు, అన్ని సౌకర్యాలు. ..

శర్మ: ఇంగ్లీషువాళ్ళు చేసిపోతే కొసవాళ్ళు వచ్చారుగా. మార్చేరాయా?

గోపి: మనవాళ్ళు!

శర్మ: పరిరంచి డబ్బు సంపాయించటమే పనిగా పెట్టుకొన్న నాటుకోట శెట్టియార్లనంటే ఏం లాభం చెప్పు. ఊఁ-సరే నాకెందుకీ గొడవ? వున్నట్టుండిచెప్తే వురివేసే కాలం యిది. ఏం? మీరు వెంటనే ఖాళీ చేయాలి.

గోపి: శర్మగారూ! ఒకటే మాట చెప్పుతున్నారా?

శర్మ: ఇక మాటేం లాభంలేదు. ఖాళీ చెయ్యాల్సిందే. గుప్తగారు వాళ్ళ దగ్గర అడ్వాన్సుకూడా పుచ్చుకున్నారు.

గోపి: మీరు బ్రోకరేజీ పుచ్చుకోలేదూ?

శర్మ: అది మీకు ఎందుకు?

గోపి: ఇందులో దాపరికం ఏముందిలెండి శర్మగారూ! సిగ్గుపడక్కర్లేదు. బాగా పబ్లిగ్గా జరుగుతున్న వ్యాపారమేగా? కనీసం ఒక్కనెల అద్దెన్నా మీ జేబులో పడందే మీరింత గట్టిగా మాట్లాడతారా అనను.

శర్మ: అవును! తీసుకున్నా! మీకెందుకూ? వెంటనే ఖాళీచేయండి.

గోపి: వీల్లేదండి.

శర్మ: ఏమిటీ?

గోపి: ఖాళీ చేయటానికి వీల్లేదు.

శర్మ: నువ్వు కుర్రాడివి, నీకెందుకిదంతా? మీ అన్నయ్యతో చెప్పు.

గోపి: చెప్పేదేమీలేదు. ఖాళీ చెయ్యడానికి వీల్లేదు; అంతే!

శర్మ: అంతేనా?

గోపి: అంతే; ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండి.

శర్మ: గుప్తాగారితో పేచీలుపడటం అంత మంచిదికాదు.

గోపి: ఏం ఫర్వాలేదు. ఆయన్ను రమ్మనండి. మాట్లాడుతాం.

శర్మ: ఈ దొరగారితో మాట్లాడ్డానికాయన వస్తాడయ్యా!

గోపి: ఉఁ-ఆ దొరగారు చెప్తే మేం ఖాళీచేస్తామయ్యా!

శర్మ: ఏమిటి నీ దౌర్జన్యం ఆయనింట్లో వుండి?

గోపి: ఆఁ-ఆయనిల్లు. అద్దెయిస్తున్నాం ధర్మంకాదు.

శర్మ: శ్రుతిమించిందే!

గోపి: మీ డబ్బుకక్కుర్తి మించలా?

ఇల్లాలు: గోపీ ఎందుకు మనకింత మాటలు? ఊరుకోరాదూ!

గోపి: ఏం ఫర్వాలా! ఏంటాయన తల తీసేది?

శర్మ: ఊఁ-సరే, చూశారుగా? (వెళ్ళాడు)

ఇల్లాలు: ఏమిటీ గోపీ! తగవులు కొని తెచ్చుకుంటున్నావు.

గోపి: ఈ వెధవ ముసలాంటివాడే. వాడి మోచేతినీళ్ళ కాశపడి వాడికిదంతా వీడే నేర్పిస్తాడు.

వాకిట్లో బిచ్చగాడు.

మేడల్లో కులికినా,
గుడిసెల్లో కులికినా,
కట్టెల్లో ఒకలాగె కాలిపోవాలి!
బూడిదలో ఒకటిగా కలిసిపోవాలి.
వున్న నాలుగునాళ్ళు వుబ్బిపోబోకురా!
కన్ను తెలియని రీతి గర్వపడబోకురా!

గోపి: ఇదీ వేదాంతం! ఆ కోటీశ్వరుడి చెప్పుల్లో ఇల్లు కట్టుకొని చెప్పరాబాబూ; మాకెందుకీ వేదాంతం.

బిచ్చ: బాబూ! ఆకలి! మాడిపోతుండా!

గోపి: ఆహారశాఖామంత్రి నడుగు.

బిచ్చ: బాబూ! మారాజులు.

గోపి: వచ్చినట్టుంది. నీ కళ్ళకు మేం మారాజుల్లా అగుపిస్తున్నాం. వెళ్లు వెళ్లు.

బిచ్చ: బాబూ కాఫీ అన్నా త్రాగుతా - అణా యివ్వండి బాబూ!

ఇల్లాలు: అయ్యో విడ్డూరమా! చూశావా; వాడు బిచ్చం అడగడం? కాఫీ తాగడానికి అణా కావాలట!

గోపి: ఏం?

ఇల్లాలు: ఇంకానయం, తాగటానికని అడగలా వాడి ధర్మం! ఒకవైపు కడుపు కాలుతుంటే యీ వంకలకి కాఫీ కావాలీ? అందు కడుక్కు తినడమా? బాగుందిది?

Akella Raghavendra's Online-ias.com

గోపి: ఏం వదినా! వాడు కాఫీ తాగరాదేం?

ఇల్లాలు: వాడి బతుక్కి కాఫీయే తక్కువైందేం? మహామహా మనమే ఒకపూట తాగితే తాగుతాం. లేకుంటే లేదు! అయినా బిచ్చ మడగడంలో ఆ దర్జా యేంటి?

గోపి. ఓహో అదా? మనం మాత్రం మన తాహతుకు మించిన బ్రతుకు బ్రతకొచ్చు. అందుకోసం అమితక్కుతినలేక అప్పులు చెయ్యొచ్చు. ఏ మహా రాజునో చూచి వాడిలా బ్రతకాలని వుబలాటపడి, లేనిపోని డాంబికాలు, దర్జాలు, నటించొచ్చు. అలవాట్లు చేసుకోవచ్చు! వాడు మాత్రం కాఫీ తాగరాదేం?

ఇల్లాలు: వుంటే ఎవరు తాగొద్దన్నారు?

గోపి: మనముండే చేస్తున్నామా యీ పనులన్నీ? మనం వుండేనా ఒకడు సంపాయిస్తుంటే ఇందరు కూర్చోని తినడం? మనకు జరుగుబాటుండేనా మనం కాఫీలు తాగడం, చదవడం, సినిమాల కెళ్ళటం? మనకన్నా వాడు చాలా నయం. యధార్థం చెప్పాడు కాఫీ తాగాలని వుందని. మనం వట్టి మోసం చేస్తాం ప్రెస్టేజి అనే బురఖాతో.

ఇల్లాలు: సరేలే నాయనా! నీతో ఎవరు వాదిస్తారు. అన్నిటికీని ఎడ్డెమంటే తెడ్డెమంటావ్.

బయటనుంచీ - అమ్మా - అని అరుపు

గోపి: అదెవరు?

ఇల్లాలు: పాల మనిషిలా వుంది.

గోపి: ఏడ్చినట్టుంది. ఇప్పుడా పాలు తీసుకురావడం?

ఇల్లాలు: డబ్బుకోసం వచ్చినట్లుంది.

పాల: అమ్మా; ఎన్నా అమ్మా!

ఇల్లాలు: వారింట్లో లేరు. రేపు...

పాల: అదేమమ్మా! ఎన్నిరోజులుగాదా చెప్తారీ మాదిరి? మీకుదా నాయమా చెప్పండి! ఒక మాసం. రెండు మాసం! మొదలుతేదీ కూడా వచ్చింది.

ఇల్లాలు: సరేనమ్మా! ఏం చేస్తాం? రేపు తప్పకుండా....

పాల: ఏం రేపమ్మా! ఆయ నెప్పుడుదా యింట్లో వుంటురు.

ఇల్లాలు: నీ కెందుకు? రేపు నువ్వు వచ్చేటప్పటికి తీసి వుంచుతాగా.

Akella Raghavendra's Online-ias.com

పాల. ఏం రేపో? రేపు. రేపని నెలయిదా గడిచిపోయింది. మాకూ బిడ్డలు పాపలు వుంటారు. అద్దా మీరు గమనం వుంచుకోవాలె. మారాజులు! మీరుదా యిట్టి చేస్తే ఎట్టా!

గోపి: ఏడ్చినట్టుంది! నీకూ మేం మారాజులమే!

పాల: బాబూ! మారాజులు.

గోపి: మళ్ళా చూడు. మారాజులు!

పాల: పేదవాళ్ళం, మమ్మల్నిట్టా తిప్పితేదా మీకేం మంచిగాదు.

బిచ్చ: బాబూ! పేదోణ్ణి.

గోపి: వెళ్ళు వెళ్ళు? నీక్కాడు చెప్పడం?

బిచ్చ: బాబూ! కలిగినోళ్ళు.

గోపి: అఘోరించినట్టుంది, వెళ్ళు. వెళ్ళవేం! ఇంతా చూస్తూ నిలబడతావు. నీక్కాదూ చెప్పటం! మతిలా?

బిచ్చ: ఓయయ్యో! చెయ్యికన్నా నోరే పెద్దదిగా వుంది నా తండ్రి.

పాల: ఇదిగోనమ్మా! ఇన్నాళ్ళుదా చూస్తిని. రేపివ్వకుంటే మర్యాద వుండదు. ఆఁ ఆఁ - (వెళ్ళింది.)

గోపి: (ఒక్క క్షణం ఆలోచించి) ఏమమ్మా పాలమనిషీ?

ఇల్లాలు: ఎందుకు? దానితో కూడా తగూ పెట్టుకుంటావా?

గోపి: కాదు. నిజం చెప్తాను.

ఇల్లాలు: ఏమని?

గోపి: రానీ - చెప్తాగా!

పాల: ఏమండీ?

గోపి: ఇదిగో! నేను నిజం చెప్తావిను. నీకు కష్టంగా వున్నా సరే. రేపుగీపు అంతా వట్టిది. నీ కివ్వట్లో డబ్బు రాదు.

ఇల్లాలు: (ఇదేమిటని బిత్తరపోయింది.)

పాల: అదెన్నాంగో - మొదత్తేది కూడా పోయింది. ఇంకా కాదంటే!

గోపి: మొదత్తేదీ మొదత్తేదీనే అయిపోయింది. వున్న విషయం చెప్తున్నా. నువ్వు నాయిక పీక్కున్నా, గొంతు చించుకున్నా లాభంలేదు.

పాల: ఇదేనయ్యా మర్యాదె? పాలు తాగినప్పుడులే ఆ బుద్ధి. ఎన్నాంగో - చదువు వున్నవాళ్ళు పెద్దవాళ్ళు.

Akella Raghavendra's Online-ias.com

గోపి: నువ్వు లక్షతిట్టు! చదువుకున్నందువల్లే మాకీ అగచాట్లు. లేకుంటే నీలా మేమూ నాలుగు బర్రెలు పెట్టుకొని పాలమ్ముకోమూ?

పాల: ఐలే బాగాదా మాట్టాడుతావు? ఆయనాఫీసు ఎక్కడో చెప్పవయ్యా. పోయి తగులుకుంటాం.

గోపి: నువ్వు సత్యాగ్రహం చేసినా లేనిదాని కేం చేస్తాడు?

పాల: అయితే - నామాల్దానా?

గోపి: కాదు. చచ్చేలోగా యిస్తాం; తప్పకుండా!

పాల: నిండా బాగా వుంది. ఇదెన్నా మర్యాదెయ్యా! బిడ్డలకుదా పాలు కోరుతారు, పాపం అని పోస్తిమి. ఇట్టా యెగేస్తారనుకుంటే సుక్కపోస్తుంమా! మళ్ళా అంతా సదువుకున్నవాళ్ళుదా! కాఫీతాగుతురు, కాపీలు (అంటూ వెళ్ళింది)

ఇల్లాలు: ఏమిటి బాబూ! ఏమిటీ పని?

గోపి: ఏం చేశానొదినా? సత్యం చెప్పాను.

ఇల్లాలు: ఏం సత్యమో సత్యం! మరీ యింత తొందరైతే ఎలా చెప్పు? పెద్దదాన్ని నేనున్నానే నేనా మాట చెప్పలేకేనా వూర్కుంది చెప్పు. ముందు వెనుక లేమన్నా ఆలోచించావా గోపీ?

గోపి: మరేం చేయమన్నావొదినా! ఎన్ని రోజులని దాన్నిలా దగా చేస్తుంటాం? ఎన్ని రోజులని దానితో ఆ మాట లనిపించుకుంటాం?

ఇల్లాలు: అలాగని పిల్లల్ని....పసికందుల్ని, పస్తుపెట్టి చంపుతానంటావా?

గోపి: వదినా?

ఇల్లాలు: రేపు వాడు పాలు తీసుకురాడు, పిల్లలగతి ఏంకావాలి ఆలోచించావా? ఆ పసికూనకు పాలేం చేయాలి. అసలే రోగిష్టులు! పాలుకూడా లేకుంటే వాళ్ళేం కావాలి? నువ్వూ నేనైతే సరే. నోరులేని పిల్లల్ని ఏదో సత్యమని పస్తులు మాడ్చి చంపుతానంటావా?

గోపి: వదినా! బుద్ధి గడ్డితింది!

ఇల్లాలు: కాదు. నీకు పిచ్చెత్తూంది!

గోపి: (ఏడుస్తూ) వదినా!

ఇల్లాలు: ఎందుకు నాయనా ఏడుస్తావు? వూర్కో.

గోపి: (పరువులో ముఖందాచుకొని) చచ్చిపోతే___

ఇల్లాలు: సరేలే. చచ్చిపోతే! చచ్చిపోతే! మంచి పాటయింది అన్నతమ్ములకు.

Akella Raghavendra's Online-ias.com

గోపి: రేపు పిల్లలకు పాలులేవు. నీకు మందు తీసిచ్చే గతిలేదు. ఒకపూట మంచి తిండిలేదు. అప్పులూ—రోగాలూ—చచ్చిపోతే — (బయట వురుములు. మెరుపులు)

ఇల్లాలు: వూర్కోవూ? నువ్వలా ఏడుస్తుంటే నాకు మతిపోతుంది.

గోపి: చచ్చేలోపుగానన్నా తీరుస్తామా యీ అప్పులు? ఒక్కరోజన్నా హాయిగా నిద్రపోతామా? లేదొదినా; లేదు. మన బ్రతుకు లింతే....

ఇల్లాలు: ఏడిస్తే తీరుతుందా?

గోపి: చస్తే తీరుతుంది.

ఇల్లాలు: (వళ్లు జలదరించి) వర్షం వస్తూంది.

గోపి: పాపాయి-చూడొదినా, పాపం ఒంటరిగా పడుకున్నాడు? భయపడతాడీ వురుములకి - వెళ్ళి తీసుకురా నే నాన్నను తీసుకొస్తా. (ఇద్దరూ వెళ్ళారు)

గాలి, వర్షంజల్లూ, యింట్లోకి కొడ్తూంది; ఒక్కక్షణం

గోపి: (వచ్చాడు) నాన్నకు జల్లు కొట్టడంలేదులే. వర్షం వెలవనీ పిల్లల్ని తీసుకొస్తువుగాని. (పైకిచూచి) ఈ కొంపకు కారడం కూడా!

ఇల్లాలు: (ఒకపాత్ర తీసుకొచ్చి కురుస్తున్నచోట పెట్టింది)

గోపి: ఆ తలుపులు వేసే వొదినా; జల్లుకొడ్తూంది.

ఇల్లాలు: (తలుపులు వేసింది)

గోపి: రాత్రికి మన చావు కుక్కలచావు. ఆ కసాయివాడికేం? వసారాకూడా ఖాళీ చేయమంటాడు (కూలబడి కప్పుకేసి చూస్తున్నాడు. తలుపు చప్పుడు. సీత తలుపు తీసింది. రంగనాథం తడిసి ప్రవేశించాడు)

ఇల్లాలు: అబ్బ! ముద్దగా తడిసిపోయారే - వర్షం వెలిసేంతవరకూ కాస్త ఆగిరారాదూ? (టవలిచ్చి) తుడుచుకోండి. (పంచ వెతుకుతూంది. రంగనాథం గోడకు నిలబడ్డాడు. గోపీ లేచాడు. రంగనాథం రెండడుగులు వేశాడు. అడుగులు తడబడ్డాయి. గోపీ గమనించాడు)

గోపి: ఏమిటన్నయ్యా? ఏంటి అలాగున్నావు?

రంగ: ఏమీలేదు. వూర్కో.

ఇల్లాలు: వేరే బట్టలు వేసుకోండి. పూర్తిగా తడిసిపోయారు.

రంగ: నేను తడిస్తే మీకేం! (కోటులోపలి జేబు చూచుకొని) అవి తడిసిపోలేదు. భద్రంగానే ఉన్నాయి. భద్రంగానే తెచ్చాను.

గోపి: ఏమిటవి?

రంగ: (తడబడుతూ ద్వారంకేసి వెళ్ళి) రా తీసుకురా! లోపలికి తీసుకురా! అవి తడవలేదుగా?

ఒక కుర్రాడు బట్టలమూట తెచ్చి లోపలపెట్టి వెళ్లాడు.

గోపి: ఎవరి కివన్నీ?

రంగ: మీకే!

గోపి: కొన్నావా?

రంగ: ... ...... .. ..

గోపి: వదినా! నీకు కావలసినన్ని చీరలు, పిల్లలకు చొక్కా-గుడ్డలు కూడా.

ఇల్లాలు: (సంతోషంగా వాటిని చూస్తూ) చాలా కొన్నారే. అందుకే యీరోజు వర్షం దంచేస్తూంది!

గోపి: అప్పుచేసి పప్పు భోజనం కాదుకదన్నయ్యా!

రంగ: హుం-అప్పు.. .అప్పుకాదు అంతకన్నా ఘోరం - అయిపోయింది-అదికాస్తా అయిపోయింది. ఇక నేనూ అందరిలాగా నే తలవంచుకొని నడవాల్సిందే! ఇక నేనూ ఆ శెట్టియార్లకు సలాములు కొట్టాల్సిందే, ఇక నేనూ న్యాయాన్ని పెట్టెలోపెట్టి తాళం వెయ్యాల్సిందే-ఇక నేనూ పైసాపాటకు ఆడాల్సిందే. అయిపోయింది. (కుంగిపోయాడు)

ఇల్లాలు: ఏమిటండీ అది?

గోపి: అన్నయ్యా! అన్నయ్యా!!

రంగ: కడుపుమాడి చస్తున్నా నైతికబలంతో రొమ్ములు విరుచుకొని బ్రతికాను. ఇక బ్రతకలేను. చావాలేను. కాదు-బ్రతికే చచ్చినట్టే.

గోపి: అన్నయ్యా! ఏం జరిగింది?

రంగ: గడ్డితిన్నానోయ్, గడ్డి! ఇదిగో (జేబులో డబ్బు వాళ్ళమీద విసిరి) సంతోషించండి. హాయిగా వుండండీ. పెళ్ళిళ్లు చేసుకుంటారో, కట్నాలిస్తారో — చదువుకుంటారో — ఏం చేస్తారో చేయండి. నా నీతిని అమ్ముకున్నా నేను గడించ గలిగిందింతే. తీసుకోండి. లంచం! నీతిని అమ్మి తెచ్చిన బిచ్చం!!

గోపి: అన్నయ్యా (వాళ్ళమీద వ్రాలి) అన్నయ్యా! వస్తులుంటాం—చస్తాం—చిరిగిన పేలికలతో బ్రతుకుతాం — నువ్వు....నువ్వీ పనెందుకు చేశావన్నయ్యా?

మాకు సంతోషమని చేశావా? నీ అంతరాత్మను చంపితే మాకానంద మను కున్నావా? అన్నయ్యా!

రంగ: ఇది మీ తప్పుకాదు....నా తప్పూకాదు. వూర్కో. అయిపోయింది ఒక్క విషబిందువు రక్తంలో ప్రవేశించింది. ఇక ఏడ్చి ఏం లాభం?....వూర్కో!

గోపి: వద్దన్నయ్యా! ఈ సొమ్ము మనకొద్దు. ఇచ్చేస్తా. నే వెళ్ళి తిప్పిచ్చేస్తా. చెప్పన్నయ్యా! (గుడ్డలమూట తీసుకున్నాడు.)

రంగ: గోపి....ఆగు.

గోపి: ఎవరిదో చెప్పన్నయ్యా! - నామీద ఒట్టు. చెప్పు. ఈ బట్టలెవరివి?

రంగ: దయాళ్ సేట్‌వి?

గోపి: ఈ డబ్బు?

రంగ: అదింక తిప్పివ్వలేం. మన చెయ్యి మించిపోయింది.

గోపి: ఏం?

రంగ: అదొచ్చినదారి మన కగమ్యగోచరం.

గోపి: ఓ అయితే - అయితే - (నోట్లు గుడ్డలమూట తీసుకొని పోతున్నాడు)

రంగ: గోపీ! గోపీ!

తలుపు తెరిచేప్పటికి జల్లు జివ్వుమని కొట్టింది. ఆగాడు. ప్రకృతి ఆ కుటుంబ నైతిక పతనానికి సాయపడింది.

Akella Raghavendra's Online-ias.com

## రెండవ రంగం

అంతా మునుపటి రంగమే

సీత ఏదో ఇంటిపని చూచుకొంటూంది. గోపి రెండు బరువైన సంచులు తెచ్చి కిందపెట్టి, మంచంవాల్చి కూర్చొని

గోపి: వదినా!

ఇల్లాలు: అవన్నీ ఏమిటి?

గోపి: చెప్తాగా అదిసరేగాని వదినా! నువ్వేదో ఫస్టుఫారందాకా చదివావు కాదూ!

ఇల్లాలు: సరే; నా చదువు చట్టుబండలైందిలే!

గోపి: అందుక్కాదు భూమి దేనిచుట్టూ తిరుగుతూంది, చెప్పుచూద్దాం?

ఇల్లాలు: భూమి సూర్యునిచుట్టూ తిరుగుతూందంటారు.

గోపి: వట్టి అబద్ధం. పచ్చిఅబద్ధం వొదినా!

ఇల్లాలు: అదేమో నాయనా; నాకేం తెలుసు? ఎవరు చూడొచ్చారు; నిజం?

గోపి: నేను చూచాను. భూమి అంటే ఈ ప్రపంచం సూర్యుడి చుట్టూ తిరగటం లేదు.

ఇల్లాలు: మరి దేనిచుట్టూ తిరుగుతోంది!

గోపి: పైసా చుట్టూ తిరుగుతూంది. తెలిసిందా? కనుక ఆ పైసా మన చేతుల్లో వుంటే ఈ భూమి, అంటే యీ ప్రపంచంలో వున్న మనుష్యులూ, మృగాలు, వస్తువులూ, అన్నీ మన చుట్టూ తిరుగుతాయి. ఇదీ సిసలైన కల్తీ లేని సత్యం.

ఇల్లాలు: చాలా కష్టపడే కనిపెట్టావు సత్యాన్ని.

గోపి: కనిపెట్టడం వేరు. వుపయోగించటం వేరు. ఈ రోజునుంచీ నేను యీ పరమ సత్యాన్ని అమలులోపెట్టి ఆచరించబోతున్నా.

ఇల్లాలు: మంచిదే.

గోపి: మంచిదే అంటే లాభంలేదు. అందుకు నీ సహాయం చాలా అవసరం.

ఇల్లాలు: బాగుంది, నన్నేం చెయ్యమన్నావు?

గోపి: నీవు ఇల్లు కదలక్కర్లేదు. వేశానుగా పెద్ద ప్లాను.

ఇల్లాలు: ఏమిటో చెప్పరాదూ!

గోపి: అది తరువాత చెప్తాలే. ముందు ఈ మినప్పప్పు మంచిదేమో చూడు.

Akella Raghavendra's
Online-ias.com

ఇల్లాలు: ఇంత మినపప్పు ఏం చేసుకోను? పప్పు లేదంటే ఎవరైనా యింత మిన పప్పు తెచ్చివేస్తారా గోపీ?

గోపి: అదంతా యెందుకు? బాగుందా? మంచిపప్పేనా? చెప్పు.

ఇల్లాలు: బాగుంది. ఆ సంచిలో ఏంటి?

గోపి: తొందరపడితే ఏలా? ... ఇదిగో చూడు. (అని సంచి కుమ్మరించగా పండ్లపొడి పొట్లాలూ చిల్లరసామాన్లూ ఉన్నాయి.)

ఇల్లాలు: ఆ పొట్లాలేంటి?

గోపి: పండ్లపొడి పొట్లాలు.

ఇల్లాలు: అయ్యో రామా! ఇదేమిటి గోపీ? నీకేమన్నా పిచ్చెత్తుతూందా? ఆ డబ్బు తీసుకెళ్ళి యీ పండ్లపొడి పొట్లాలు మినపప్పు పట్టుకొచ్చావే - ఏం చేసుకోను? డబ్బిలా తగలేస్తే ఎలా చెప్పు, ఏమిటీపని? మీ అన్నయ్య ఆ డబ్బు ఒక్కపైసా తీసుకురావద్దని కెంత బాధపడుతున్నారో నువ్వు చూస్తూనే వున్నావుగా! మీ అన్నయ్య చూస్తే....

గోపి: కోప్పడతాడు, తంతాడు! అంతేనా?

ఇల్లాలు: అయినా యిదేం పని చెప్పు; కాలేజీ జీతమన్నా కట్టకుండా!

గోపి: అంతకన్నా మంచిపని చేశా వొదినా.

ఇల్లాలు: ఏమిటో నీ విపరీతపు చేష్టలూ నీవూనూ. మీ అన్నయ్య చూస్తే నిన్నూ నన్నూ బతకనివ్వరు బాబూ. వెళ్ళు నా మాట విను. అవి అన్నీ తిప్పిచ్చేసిరా. ఎందు కనవసరంగా ఆయనచేత మాట లనిపించుకుంటావ్. ఆయనకు వొళ్ళు తెలియని కోపం వస్తుంది. వెళ్ళు బాబూ? వెళ్ళు.

గోపి: ఎందుకొదినా అలా గాభరాపడతావ్? నువ్వేమీ భయపడకు. నే నున్నానుగా అన్నయ్యకు అంతా నచ్చజెపుతా.

ఇల్లాలు: నచ్చచెప్పటం మాట దేవుడెరుగు కాని, చచ్చేట్టు దెబ్బలు తింటావు.
(బైట కారుహారన్ శబ్దం. "గోపీ" అని కేక.)

గోపి: ఆఁ - వస్తున్నారా!

ఇల్లాలు: ఎవరది?

గోపి: రాత్రి నన్ను కొట్టాడే ఆ కుర్రాడు.

ఇల్లాలు: మళ్ళీ ఏ ముఖం పెట్టుకొచ్చా డిక్కడికి?

గోపి: రాత్రి తాగివున్నాడులే వొదినా?

ఇల్లాలు: తాగాడూ! అంత చిన్న కుర్రాడే?

Akella Raghavendra's Online-ias.com

గోపి: తాగుడుకు చిన్నా పెద్దా వుందేంటి?

ఇల్లాలు: తాగుడు తీసేశారన్నారుగా!

గోపి: పబ్లిగ్గా. బ్లాక్‌మార్కెట్టులో బాగా దొరుకుతూంది.

ఇల్లాలు: దానికీ బ్లాక్‌మార్కెట్టే!

గోపి: ఈ రోజుల్లో మంగలిషాపుల్లో కూడా బ్లాక్‌మార్కెట్టుంది.

ఇల్లాలు: అయినా ఆ తాగుబోతుతో నీకేం చెప్పు.

గోపి: తాగితే ఏం వదినా? తప్పా?

ఇల్లాలు: బాగుంది మీ అన్నయ్యతో అను; యీ మాట.

గోపి: పిచ్చివదినా! వాడికి డబ్బుంది తాగుతాడు. మనదేం పోయింది? మతిలేక తాగుడు తీసేశారుగానీ - నేనైతే ప్రతి లక్షాధికారికీ కొంత కోటా ఏర్పరిచి తప్పక తాగాలని రూల్ పెట్టేవాణ్ణి.

ఇల్లాలు: చాలా మంచిపనే నీవు తాగవుగదా?

గోపి: అదికాదొదినా! వాళ్ళు గనుక తాగకపోతే ఆ డబ్బు ఖర్చయేదెట్లా? అలా లక్షలు లక్షలు యినప్పెట్టెల్లో మూలుగుతుంటాయి, యింకోళ్ళ కంటపడకుండా. అసలీ డబ్బుగలాళ్ళని బాగా తాగించాలి. అప్పటికన్నా వాళ్ళ డబ్బు నలుగురి చేతుల్లో కొస్తుందేమో (మరల కారుహారన్) ఆఁ. వస్తున్నానురా, ఇదిగో వదినా నే నిప్పుడే వస్తాగాని ఆ పప్పంతా అప్పడాలు చేసిపెట్టు.

ఇల్లాలు: అప్పడాలా?

గోపి: ఆఁ.

ఇల్లాలు: ఎందుకూ?

గోపి: కావాలి. రేపు సాయంత్రానికల్లా కనీసం రెండువేల అప్పడాలు కావాలి.

ఇల్లాలు: రెండువేల అప్పడాలే.

గోపి: అవును. వుందిగా ప్లాను. చెప్తా. (అంటూ వెళ్ళాడు)

ఇల్లాలు: (అలా ముక్కుమీద వేలు వేసుకొని ఒకక్షణం ఆగి, తరువాత పండ్లపొడి పొట్లాలు సంచిలో వేస్తుండగా రంగనాథం చరచరా వచ్చి కోటుతీసి మంచం మీద విసరివేసి)

రంగ: ఏమిటవి?

ఇల్లాలు: (జంకుతూ) ఏమీలేదు.

రంగ: ఏమీ లేదంటావేం? నా కళ్ళు పోయాయా?

ఇల్లాలు: ఎందుకండీ అట్లా కోప్పడతారు? ఈ మాత్రానికే కళ్ళు పోవాలా?

Akella Raghavendra's Online-ias.com

రంగ. మరి ఏమీ లేదంటావేం?

ఇల్లాలు: ఇంటికి రావడం రావడం యిట్లా ముండిపడుతూ వస్తారు. అదేం నా కర్మో!

రంగ: నీ కర్మకాదు. నా తలరాత.

ఇల్లాలు: పోనీ మీకు హాయిగావుంటే ఆ ఆఫీసులోనే వుండిపోరాదూ!

రంగ: ఆఫీసులోనన్నా నన్ను హాయిగా వుండనిస్తారు. మీరు వెధవముండా! నాకు దాపరించారు. వాయిరా దేవుడా యీ సంసారం. "జై సీతారాం" అని నెత్తిన గుడ్డ వేసుకపోతే బాగుండును.

ఇల్లాలు: అంత కష్టం ఏ మొచ్చిందండీ యిప్పుడు? నేనేగా మీకు శని పోనీండి. నేను చస్తాను. మీరన్నా హాయిగా వుండండి.

రంగ: మీ కంపెనీకన్నా ముందు నేనే చచ్చేటట్లున్నా. లేకుంటే పాలమనిషి యింటికివస్తే జవాబు చెప్పి పంపే యోగ్యతలా? ఆఫీసుకు పరుగుతారూ? నే నేమన్నా వుద్యోగం చేయాలనా! నలుగురిలో తలయెత్తుకొని తిరగాలని మీకు వుందా అని. పోతే పోతాడ నేగా? దరిద్రపు మూక!

ఇల్లాలు: వాన్నెవరు తరిమారండీ ఆఫీసుకి! నిన్నరాత్రి మీరు వెళ్ళిన వెంటనే వచ్చింది. ఉదయం పాలు కూడా తీసుకురాలేదు. వచ్చివుంటే డబ్బు యిచ్చేసేవాళ్ళం.

రంగ: పోనీ సవ్యంగా జవాబు చెప్పారూ దానికి? వచ్చేలోపుగా యిస్తామన్నారటగా అప్పంతా? ఇంట్లో కూర్చుని తిని, మదం పట్టిన మాటలేగా ఇవి (విసురుగా నడిచాడు. కాలికి సంచి తగిలి పప్పు క్రింద పోయింది.) వెధవ కొంప! దారి కన్నీ అడ్డాలే; ఛీ!ఛీ! సంతోషం లేదుగా యీ బతుక్కి (పప్పు చూచి) ఈ పప్పెక్కడిది?

ఇల్లాలు: కొన్నదే.

రంగ: ఇంత పప్పుకొన్నారూ!

ఇల్లాలు: ఆఁ!

రంగ: మీకేమన్నా మతి వుందా? ఇదేంటి (పొట్లాము తీసి చూచి) ఈ పండ్లపొడి పొట్లా లెందుకు?

ఇల్లాలు: ఎందుకో మీ తమ్ముడు కొని తెచ్చాడు.

రంగ: నేను నానాగడ్డితిని తీసుకొచ్చివేస్తే మీరిలా తగలేస్తారేమిటే? ఈ మినప్పప్పు పండ్లపొడి పొట్లాలు వాడుకొనితేవడమేంటి? నువ్వు దాన్ని తీసి వుంచడ

Akella Raghavendra's Online-ias.com

మేంచే? మీరు నన్ను బతకనివ్వదలచుకున్నారా లేదా? చెప్పండి ఆ మాట రాస్తా. ఏ సుయ్యో గుయ్యో చూచుకొంటా.

ఇల్లాలు: ఎందుకండీ అంత అఘాయిత్యం?

రంగ: అఘాయిత్యమంటావు మళ్లా (చెయ్యెత్తి కొట్టబోయాడు కాని ఆగాడు.) దరిద్రప్పు మూక...నా కర్మం కాలి నాకే దాపురించారీ. (ఇల్లాలికి కళ్ళనీళ్ళు తిరిగాయి. పైటతో తుడుచుకుంది) ఈ దొరగారెక్కడికి దయ చేశారు?

ఇల్లాలు: ఏమో ఎవరితోనో స్నేహితులతో వెళ్లాడు.

రంగ: ఆ ఎర్రటి కుర్రాడేనా?

ఇల్లాలు: ఆఁ.

రంగ: ఆ తాగుబోతు వెధవతో వీడికి స్నేహం. వీడేమో చదివి వుద్ధరిస్తాడని నా చావు నేను చస్తున్నా.

"రంగనాథం" అని బైట కేక.

రంగ: (విసురుగా) ఎవరూ?

డాక్టరు: (వచ్చి) నేనురా! ఏమిట్రా అన్నదమ్ములిద్దరూ యీ రోజే మహా టెంపోలో వున్నారు?

రంగ: మావా డగుపించాడా నీకు?

డాక్టరు: ఆఁ. చాలా సేపయిందిలే కనుపించి. అదేమిట్రా వాడిచేత ఏదో వ్యాపారం పెట్టించినట్టుంది నువ్వు?

రంగ: ఏం వ్యాపారం?

డాక్టరు: బస్సు స్టాండ్ ల దగ్గర పండ్లపొడి పొట్లాలమ్ముతున్నాడే.

రంగ: మావాడే? గోపీ?

డాక్టరు: అవున్రా.

రంగ: నువ్వు సరిగ్గా చూచావా?

డాక్టరు: చూడ్డమేంటి! మాట్లాడితే.

రంగ: నీకు బుద్ధిలేదురా!

డాక్టరు: అయిందీ! నన్నే అన్నావు ఆమాట?

రంగ: మరి మాట్లాడాననంటావేం; ఎముకలు విరగదన్నక.

డాక్టరు: ఎవర్ని? వాడినే!

రంగ: ఏం?

Akella Raghavendra's Online-ias.com

డాక్టరు: ఎందుకొచ్చిందిలే వాడిజోలి కెళ్ళడం: మందలించేవాణ్ణేకాని . నువ్వే ఆ వ్యాపారం పెట్టించావేమోననుకున్నా.

రంగ: ఊఁ, అనుకున్నావ్? అవున్రా అవును. మేమంటే అంత తేలికై పోయాం నీకు.

డాక్టరు: నేనేమన్నానని?

రంగ: ఎంత వెధవ బతుకు బతుకుతున్నా బస్‌స్టాండులవద్ద పళ్ళపొడి పొట్లాలమ్మే గతి పట్టలేదులే; నీ దయవల్ల.

డాక్టరు: వూర్కే తమాషాగా అన్నదాన్ని నువ్వింత సీరియస్‌గా తీసుకొంటావనుకో లేదురా!

రంగ: తమాషా కేముంది. యధార్థం అంటే! ఏ డబ్బుగలవారో కట్టెలు మోసుకొస్తే "సింప్లిసిటీ" అంటారు. అదే మాబోటి వాళ్ళయితే గతిలేదంటారు. అంతేగా?

డాక్టరు: సత్యం చెప్పావ్. నువ్వలా ఫీలవుతావో లేదో చూద్దామనే అన్నా నాముర్కా; మనకెంత చెడ్డా కొంత "ప్రెస్టేజంటూ ఏడ్చింది. నీ 'కో' క్లార్కులే చూశారనుకో అప్పుడు నీ ప్రెస్టేజేం" కావాలి! అది కాస్త ఆలోచించి ఆ గోపీని మందలించమని చెప్పడానికే వచ్చా. వేరే విధంగా అనుకుంటావా?

రంగ: ఎబ్బే!

డాక్టరు: మరి నేవస్తా? (వెళ్ళాడు)

గోపి: (ఎదురుగా వచ్చాడు. చేతిలో ఒక ప్యాకెట్టుంది)

డాక్టరు: ఏం గోపీ! పళ్ళపొడి వ్యాపారంలో ఏ మాత్రం లాభం?

గోపి: ఆఁ – నేనూ ఒక పదివేలు గడించిన రోజు అందరూ "భే"షంటారు లేండి. డాక్టరుగారూ!

డాక్టరు: రైట్, రైట్! (వెళ్లాడు)

రంగ: (మౌనంగా కూర్చున్నాడు సమాధానం వింటూ)

గోపి: (ప్యాకెట్టలా పెట్టి, చొక్కా విప్పుతున్నాడు)

రంగ: ఎక్కడి కెళ్లావురా?

గోపి: ఎక్కడికీ లేదు.

రంగ: ఎక్కడికీ లేదంటే – యిక్కడే వున్నావా? నా కళ్ళేం పోయాయా?

గోపి: ఓ స్నేహితుడితో అట్టా వెళ్ళి వచ్చానన్నయ్యా.

రంగ: ఎవరా స్నేహితుడు?

Akella Raghavendra's Online-ias.com

గోపి: నీకు తెలియదన్నయ్యా.

రంగ: నా కందరూ తెలుసు చెప్పవోయ్.

గోపి: శేఖరని.......

రంగ: ఆ తాగుబోతు వెధవేనా?

గోపి: (ఏమి చెప్పాలో తోచక చివరికి) అవును.

రంగ: అవునంటావ్రటా సిగ్గులేకుండా.

గోపి: వాడు తాగితే నాకు సిగ్గులేకపోవడ మేమిటి?

రంగ: కాక మరేంటి? వాడి వెనకాల నువ్వెందుకు వెళ్లావురా? బుడ్డీ లందివ్వటానికా? ఎవరినైనా తార్చదానికా?

గోపి: నే నా పనులు చేయలే దింతవరకు. కాని ఆ పనులు చేస్తూన్న ''పోకాల్లు'' పెద్దవాళ్ళందరూ నవనాగరిక సంఘంలో గౌరవనీయులుగానే వున్నారు.

రంగ: (తన్నేంత దూరం వెళ్ళి, ఆగి) కాలేజీ జీతం కట్టావ్?

గోపి: లేదు.

రంగ: ఇంటి అద్దె ఇచ్చావా?

గోపి: లేదు.

రంగ: నే నెప్పుడు నీకు డబ్బిచ్చింది?

గోపి: రాత్రి.

రంగ: ఎందుకిచ్చానోయ్?

గోపి: ఆ రెండు పనులకు.

రంగ: మరెందుకు చేయలేదు?

గోపి: మన మంచికే!

రంగ: ఓహో! మనమంచికే చేశావన్నమాట. మమ్మల్నంతా వుద్ధరించాలని చేశావు.

గోపి: వీలయితే - అనుకూలిస్తే - వుద్ధరిద్దామనే.

రంగ: ఊఁ హూఁ! అంత పెద్దవాడివయ్యావు? ఇంకేం? ఈనాటికి నాకు మాటకు మాట బదులు చెప్పేవాడివయ్యావు. సరే!

గోపి: నా తప్పు ఏమీలేదు గనుక చెప్తున్నా.

రంగ: ఓయ్ నోరు! ఇంకా మాట్లాడుతున్నాడు, తప్పేమీ లేదట. లేదూ! మా బతుకులు రాస్తా నడివీధిలో వేస్తూ!

గోపి: నేనేం చేశాను!

రంగ: ఏం జేశావు? బస్స్టాండులో పళ్ళమ్మి పొట్లాలమ్మలేదూ!

Akella Raghavendra's Online-ias.com

గోపి: అవును.

రంగ: అవును. ఇంకా జవాబు చెప్తాడూ! సిగ్గులా? మర్యాదలా? ఛీ: వెధవ బ్రతుకు! ఇంటింటికి అడుక్కు తినలేకపోయావు?

గోపి: నేను చేసిందంత నీచమైనపని అని నాకు తెలియదు.

రంగ: తెలియదురా? జవాబు చెప్పడానికి తెలుసూ? అసలు కాలేజీ జీతం ఎందుకు కట్టలేదోయ్?

గోపి: నా కిష్టంలేదు.

రంగ: ఏమిటిష్టంలేదు?

గోపి: ఆ కాలేజీ చదువు.

రంగ: అది చేరకముందే ఏడవలేక పోయావు?

గోపి: అప్పుడు తెలియదు.

రంగ: ఇప్పుడు తెలిసిందా అంతకన్నా పళ్ళపొడి అమ్మటమే మంచిదని?

గోపి: అవును.

రంగ: ఆఁ: ''రాస్కెల్'' (పటపట పెంపడు వొళ్ళు తెలియకుండా కొట్టాడు) మారుమాట చెప్తావు? (మళ్ళా ఒక దెబ్బ)

ఇల్లాలు: అయ్యో! అయ్యో! ఏమిటండీ పిల్లవాణ్ణలా కొడుతున్నారు? ఫూర్కోండీ (అడ్డు వచ్చింది)

రంగ: (ఆమెను విదిలించి) నువ్వే ఇంతకూ కారణం?

మున: ఒరే రంగా! ఒరే గోపీ! - ఏమిటిరా - ఏమిటిరా అది?

ఇల్లాలు: మరీ అంత ఒళ్ళు తెలియని కోపమైతే ఎలా చెప్పండి?

రంగ: మాట్లాడావంటే నీకూ పళ్ళూడతాయ్!

మున: ఏమిటిరా అది? ఎందుకురా ఆ అమ్మాయి మీద అట్లా అరుస్తావు. ఏమొచ్చిందిరా (అంటూ వచ్చాడు)

గోపి: (నాన్నను పట్టుకొని) ఏంలేదు నాన్నా - నువ్వెళ్ళి పడుకో.

మున: ఎందుకురా వాడట్లా అరుస్తున్నాడు?

రంగ: చావాలేక - బతకాలేక.

ఇల్లాలు: అయ్యో! భగవంతుడా! ఇదేంటి తండ్రీ. అన్ని అగచాట్లు మా నెత్తినే వేస్తున్నావు?

మున: అంత కష్టం ఏమొచ్చిందిరా ఇప్పుడు? ఆ ఇల్లాల్నెందుకు అట్లా ఏడిపిస్తావ్?

Akella Raghavendra's Online-ias.com

రంగ: చస్తే ఏడుస్తారో - ఏడవరో అని.

గోపి: అన్నయ్యా! నాన్నతో ఎందు కట్టాంటి మాటలు? నువ్వెళ్ళి పడుకో నాన్నా- ఏమీలేదు. అన్నయ్య కొంచెం కోపంగా వున్నాడంతే.

మున: కొట్టాడా?

గోపి: కొడితే కొట్టాడు; అన్నయ్యేగా! నువ్వెళ్ళి పడుకో.

మున: ఏమిట్రా రంగా యిది? వాణ్ణట్టా రోజుకొకసారన్నా వాపవాదేస్తుంటా వెందుకు? వాణ్ణి వాడి మేనమామ ఇంటికైనా పంపించకపోయావా నీ కంత కష్టంగా వుంటే.

రంగ: నేను కొట్టిందొకటే కనుపిస్తుంది. వాడేం చేశాడో అడుగు.

మున: ఏం చేశాడ్రా?

రంగ: ఏం చేయాలి? బజార్లో బస్స్టాండు దగ్గర పళ్ళమ్మే పొట్లాలు అమ్ము తున్నాడు సిగ్గులేకపోతే సరి!

మున: అవునా గోపీ?

గోపి: అవున్నాన్నా.

మున: నీకు రానురాను యిదేం పాడుబుద్ధులు పుడుతున్నాయిరా?

గోపి: పాడుబుద్ధులు కావు నాన్నా-నాలుగు కాసులు గడించే బుద్ధులు.

మున: ఏడ్చినట్టే వుంది. మన వంశం ఏమిటి - మన తాహతేమిటి? చెడపుట్టావు కదరా! నీ కిదేం కర్మరా? వాడేదో చాకిరీచేసి నానాగచాట్లు వాయిపడి తెచ్చి వేస్తుంటే తిని చదువుకోటానికి నీకేంరా? నేను బతికుండగానే యిదెక్కడి అప్రతిష్టరా?

గోపి: సరేలేనాన్నా ఇక చెయ్యనులే. నువ్వెళ్ళి పడుకో.

మున: వాణ్ణేడిపించకురా! ఆఫీసునుంచి ఏ అర్ధరాత్రికో వస్తాడనలు. వాణ్ణి కాస్త సుఖంగా వుండనీరా, ఆ నాలుగు ఘడియలూ నామాట వినరా!

గోపి: అలాగే లే నాన్నా - నువ్వెళ్ళి పడుకో (తీసుకెళ్ళాడు)

రంగ: (చూస్తూ నిలబడి మంచంమీద కూలబడి దుఃఖం కప్పుకున్నాడు)

ఇల్లాలు: (ఏమీ తోచక దుఃఖాన్నాపుకొంటూంది)

గోపి: (వచ్చి) అన్నయ్య భోంచేశాడా వదినా?

ఇల్లాలు: (లేదని తలవూపి చెప్పింది)

గోపి: లే అన్నయ్యా! భోంచేద్దువుగాని.

రంగ: ........ ........

Akella Raghavendra's Online-ias.com

గోపి: మరచా-యిదిగో వదినా! నీకు టానిక్. (పాంటుజేబులోనుంచి తీసిచ్చాడు)

రంగ: (తలెత్తి చూచాడు)

గోపి: వదినా? నీకు చీరకూడా తెచ్చా (పొట్లాం విప్పి యిచ్చాడు)

ఇల్లాలు: నాకెందుకుబాబూ - పిల్లలకు నాలుగు చొక్కాగుడ్డలు తీసుకరాలేకపోయావు; చలికి వణికిపోతున్నారు.

గోపి: నీకు చాలా చీరలున్నాయా? ఆ ఒక్కచీరతో ఎన్నాళ్లు గడుపుతావు పిల్లలకు రేపు తెద్దాంలే.

ఇల్లాలు: ఊఁ నేనెట్లాగో గడుపుకుంటా___పిల్లలు...

గోపి: పిల్లలు ఏడుస్తున్నారు. చూడొదినా!

ఇల్లాలు: ఊఁ (వెళ్ళింది)

గోపి: (అన్నయ్యను తాపీగా చూచి) భోజనానికి లే అన్నయ్యా!

రంగ: ..................

గోపి: నే చేసింది తప్పే, అనవసరంగా వదిన్ని బాధపెడ్తున్నాం. ఉదయం ఎప్పుడో తిన్నది.

రంగ: నీకు నిజంగా చదవాలని లేదేంరా?

గోపి: ఇప్పుడు మళ్లా ఎందుకా గొడవ? భోంచేసి మరీ మాట్లాడుకుందాం.

రంగ: ఫర్వాలేదులే నిజంచెప్పు.

గోపి: చదవాలని లేకపోవడం గా దన్నయ్యా! ఎలా చదవమంటావు? చెప్పు నిన్ను యిన్ని అగచాట్లు పెడుతూ ఎందుకు చెప్పు యీ చదువు. నాకు మతిపోతుం దన్నయ్యా! నా వుద్దేశ్యం ఒకటే అన్నయ్యా! చదివి విజ్ఞానం గడించడం మానవుడైనవాడికి అవసరమే. కాని, అంతకన్నా బ్రతకడం ముఖ్యం. సంసారం నానాటికి నరకమైపోతూంది. ఏ వ్యాపారమన్నా చేసి నాలుక్కాసులు తెచ్చి వేస్తే యీ సంసారాన్ని కాస్త సుఖంగా లాగ్గలమేమోననే నా ఆశ. అంతకన్న వేరేంలేదు.

రంగ: అలాగని పళ్ళపొడి పొట్లాలమ్మే ఖర్మేంటిరా మనకు?

గోపి: అందులో తప్పేంటన్నయ్యా! పెట్టుబడికి డబ్బే వుంటే గౌరవమనుకునే పెద్ద వ్యాపారమే చేసేవాణ్ణి. ఈ యమయాతనకంటే యింటింటికీ తిరిగెళ్ళి అప్పడా లమ్మడం మేలనిపిస్తుందన్నయ్యా! నా బాధ నువ్వు గ్రహిస్తా వనుకుంటా.

రంగ: ఆఁ___

Akella Raghavendra's Online-ias.com

గోపి: మనం వస్తులున్నా పడివుండాలిగాని యిలాంటి పనులు మాత్రం చేయకూడదు. అంతేనా అన్నయ్యా: ఇదేగా మన ప్రెస్టేజీ! పిల్లలా రోగాలతో కుళ్ళిపోతూండొచ్చు. వాళ్ళకు రెండు చొక్కాలన్నా లేకపోవచ్చు. అప్పుల వాళ్ళు నానాబూతులు తిట్టొచ్చు. ఈ మురుక్కాలువ కంపులో - ఈ కారు షెడ్‌లో బతకొచ్చు. జీవితంలో సుఖమనేది ఏ కోశానా లేకపోవచ్చు - ఈలా చింతతో తిండిలేక విశ్రాంతిలేక పని చేసి, చివికి చావొచ్చు. నీతిని అమ్ముకోవచ్చు.

రంగ: గోపీ!

ఇల్లాలు: (వస్తుంది.)

గోపి: కూలివాళ్ళు మనకంటే నయం. వాళ్ళు నలుగురుంటే నలుగురూ పనిచేస్తారు- తెస్తారు, తింటారు, లేదా పస్తుంటారు. మన మలాకాదు; ఒక్కడు సంపాదించాలి. ఇందరం బతకాలి. ఆడది యిల్లు వదలిపెట్టకూడదు. ఇంటిపని తప్ప వేరింకేం చెయ్యకూడదు. తెల్లచొక్కా లెయ్యాలి. మంచి చీరెలు కట్టాలి. ఆ డబ్బుగలవాళ్ళతో మనుష్యుల మనిపించుకోవాలి! అంతేనా!

రంగ: చాల్లేవోయ్! (చరచరా వెళ్తున్నాడు)

గోపి: (అడ్డువెళ్ళి) నన్ను చంపుకుతిన్నట్టన్నయ్యా....భోంచేసి వెళ్ళు.

రంగ: (చేయి పైకెత్తాడు, కాని వేగం తగ్గింది. గోపీ లెంప తాకి చూచాడు.)

గోపి: పెద్దగా దెబ్బ తగల్లేదులే అన్నయ్యా!

రంగ: (ఆగలేక తప్పించుకొని చరచరా వెళ్ళాడు.)

గోపి: అన్నయ్యా! అన్నయ్యా! (తిరిగిచూడకుండా రంగనాథం వెళ్ళాడు.)

ఇల్లాలు: (కంగారుతో) ఏమిటి బాబూ అది? వెళ్ళు బాబూ వెళ్ళు. ఆయన్ను తీసుకురా గోపీ! నా తండ్రివి కదూ! వెళ్ళు. ఆయనకోపం వచ్చినా దుఃఖం వచ్చినా అంతే! వెళ్ళు బాబువికదూ!

గోపి: ఎందుకొదినా భయం?

ఇల్లాలు: ఈ రోజల్లా ఒక్కటే చావుజపం చేస్తున్నారు? మాటంటే చస్తాం చస్తామని. ఈ దీంట్లో ఆయనేం చేసుకుంటారో బాబూ (అని వెక్కి వెక్కి ఏడుస్తుంది.)

గోపి: వదినా ..వదినా! వూర్కో! అన్నయ్యేం చేసుకోడు. చచ్చిపోవడమంటే అంత సులభమా? వూర్కో వదినా.

ఇల్లాలు: అయ్యయ్యో! అయ్యయ్యో! (అని తల మంచంకోడుకేసి బాదుకొంటుంది.)

Akella Raghavendra's Online-ias.com

గోపి: వదినా! వదినా ఏమిటిది? (ఏమీ చేయలేక తల పట్టుకొన్నాడు.)
ఇల్లాలు: (చ(రున లేచివెళ్ళింది.)
గోపి: వదినా ఎక్కడికి? (వాకిలిదాకా వెళ్ళి, నిట్టూర్చి రెండుసార్లటూ యిటూ తిరిగి చేవుని పటం కనబడగా పారేసేంత విసురుగా తీసి మళ్ళీ యేం తోచిందో అక్కడే పెట్టాడు.)
గుప్త: (ఇంతలో బయటనుండి) ఎవరయ్యా యింట్లో?
గోపి: మనుష్యులు.
గుప్త: ఆఁ హాఁ! మనుష్యులేనా?
గోపి: ఆఁ. ఓటర్ల లిస్టుతో పరుగెత్తుకొచ్చేటప్పుడు ఏమనుకున్నారు?
గుప్త: ఏమోయ్, శర్మా! ఈయన ఓటు యిస్తేనేకదూ మనం గెల్చింది?
గోపి: లేదు, లేదు! మీ జాతకాల్లో వ్రాసుంది గెల్చారు.
గుప్త: సరే, శర్మా. .అడుగు, నిలబడతావేం?
శర్మ: మీ అన్నయ్య లేడూ?
గోపి: లేడు.
శర్మ: యింటి అద్దె యిచ్చి వెళ్ళాడా!
గోపి: లేదు.
శర్మ: లేదంటే.
గోపి: లేదనే.
శర్మ: ఇచ్చి వెళ్ళలేదనా? అసల్లేదనా!
గోపి: రెండూ లేదు.
శర్మ: చూచారండీ జవాబులు?
గోపి: జవాబులు చూట్టమేమిటయ్యా? వినాలిగాని! సరే! నే నడిగినవాటికి జవాబులు చెప్పండి.
శర్మ: నువ్వడిగినవాటికి మేం చెప్పడమేమిటి?
గుప్త: ఏం అబ్బాయ్! బలేడబాయిస్తున్నావే! ఆఁ. హూఁ ఏమిటి నువ్వడిగేది! ఏదీ? (ఈ మాటలంటూ ఒకాయన లోనికి వచ్చాడు. ఆ సన్నపాటి ద్వారంలో ఆయన అవస్థపడి రావడం చూచి గోపి పకపక నవ్వాడు)
గుప్త: ఏమయ్యా అట్లా నవ్వుతావు?
గోపి: ఆఁ - ఏమీలేదు! గుప్తాగారూ! మీ బ్లాక్‌మార్కెట్ బొజ్జను చూచి. (మరల నవ్వాడు)

Akella Raghavendra's Online-ias.com

గుప్త: (చాలా కోపంతో) ఇదిగో మీరు వెంటనే ఖాళీ చేయకపోతే...

గోపి: పోలీసుల్ని పిలిపిస్తారు అంతేనా? అది సరేగాని గుప్తాగారూ! మేమీ యింట్లో చేరేటప్పుడు మీరేం చెప్పారు?

గుప్త: ఏం చెప్పాం? అద్దె మొదటి తారీఖున తప్పకుండా యిచ్చెయ్యాలన్నాం.

గోపి: అంతేనా? ఎలక్ట్రిక్ లైట్లు వేయిస్తామనలా?

శర్మ: ఎలెక్ట్రిక్ లైట్లా...?

గోపి: అన్నారా లేదా! ఆన్సర్ టుది పాయింట్.

గుప్త: అన్నామయ్యా!

గోపి: కుళాయి బాగుచేయిస్తామన్నారా లేదా?

గుప్త: అన్నాం.

గోపి: ఆ మురుక్కాలువ మూయిస్తామన్నారా? ఈ ద్వారానికి కమ్మీతలుపులు పెట్టిస్తామన్నారా? ఈ వాగ్దానాలన్నీ ఎన్నికల వాగ్దానాలై పోయాయేం? (శర్మ, గుప్తా ఒకరి నొకరు చూచుకున్నారు.)

గోపి: పలుక రేం? ఈ కుళాయినీళ్ళొకసారి తాగిచూడండి.

గుప్త: అది ...అది కార్పరేషన్వాడుగు!

గోపి: అక్కడా మీరేకదయ్యా దాపురిస్తారు! పదవులన్నీ మీకో లేకపోతే మీ బంధువులకో - మీ సానుభూతి పరులకో; యిక ఎక్కడికెళితే ఏం లాభం?

గుప్త: ఇదిగో అబ్బాయ్! ఒక్కటే మాట చెప్తున్నా...మీ కిష్టంవుంటే వుండండి, లేదా ఖాళీచెయ్యండి అంతే.___

గోపి: బావుంది మీక్కానక యిండియా ప్రధానమంత్రి పదవిస్తే మీ పరిపాలన ఈ యింటి పరిపాలనలాగ వుండి ప్రజలందరూ ఏడిస్తే మీ కిష్టముంటే వుండండి, లేకుంటే యిండియానే ఖాళీ చెయ్యండని చెప్తారా ప్రజలకు?

శర్మ: ప్రజలు!

గుప్త: ప్రజలు! ప్రజలు! మహా నేర్చారు లేవయ్యా యీ యెంగిలిముక్కలు! చాకు చేయని వెధవలంతా ప్రజలు.

గోపి: ఆ మాట నాతో అంటే అన్నారుకానీ పబ్లిగ్గా అనకండి.

గుప్త: ఏం? అన లందామవస్తే మేమంతా ఎవరం? ప్రజలం కామూ! కడుపు చేత పట్టుకొని, చదువూసంధ్యా లేకుండా గొఱ్ఱెల మందల్లా గొడ్లల్లా బ్రతుకుతూండే కుంకలేనా ప్రజలు? మేం ప్రజలం కామూ?

గోపి: కారు. మీరు ప్రజలు కారు. మీరు మనుష్యులుకారు. ఆ గొర్రెల మందల్ని దోపిడి చేసుకుంటూండే తోడేళ్ళు. ఆ గొడ్లతో బండచాకిరీ చేయించుకొని పొట్ట నింపుకొంటూన్న సోమరిపోతులు. వాళ్ళ అజ్ఞానం మీద వ్యాపారం చేస్తూన్న రాక్షసులు. సృగాలు, దొంగలు!

గుప్త: ఆఁ. (కర్ర విసిరాడు. గోపీకి బాగా దెబ్బతగిలింది)

శర్మ: ఆఁ-పద శర్మా - పద పోలీసుస్టేషన్‌కు పద. (గుప్త ముందుగా వెళ్ళాడు.)

ఇల్లాలు: (ఇల్లాలు వచ్చింది. గోపి రక్తం తుడుచుకుంటున్నాడు. చూచి కెవ్వుమని కేకేసింది.)

గోపి: వదినా ఏమిటది?

ఇలాలు: నెత్తురు నెత్తురే? అయ్యోబాబూ! ఎవరుకొట్టారు?

గోపి: ఎవరూ కొట్టలేదు. ఏం లేదు! గుప్తాగా రొచ్చారు. ఆయన చేతికర్ర తిప్పుతూంటే తగిలింది; అంతే.

ఇల్లాలు: జానెడింట్లో మూరెడు కట్టె అని, యీ యింట్లోకి వచ్చి ఆయన కర్ర తిప్పటమే? చూడు, పెద్ద గాయమైందేమో - ఆస్పత్రికన్నా వెళ్ళు.

గోపి: గుప్తాగారు తన బంగ్లా అనుకున్నారులే వదినా?

ఇల్లాలు: ఎందుకొచ్చింది? డబ్బుందే-యిచ్చేరాదూ?

గోపి: ఇచ్చేవాణ్ణే కాని - ఏమిటా న్యాయం? తాను చెప్పింది ఒక్కటీ చేయకుండా అద్దె మాత్రం దోచేస్తాడూ; నెల తప్పకముందే?

ఇల్లాలు: ఏమో బాబూ! ఈ రోజన్నీ దెబ్బలు - తిట్లు - గోలగా వుంది. నాకేమో భయమేస్తోంది ఆయనెక్కడి కెళ్ళారో ఏమో!

గోపి: అలా బీచికి వెళ్ళుంటాడులే వొదినా!

ఇల్లాలు: బీచికే! బాబూ! నువ్వన్నా కాస్త వెళ్ళి చూచిరా. నా కెందుకో సముద్రం మాటంటే గుభేలు మంటుంది. మొన్నకూడా ఎవరో...వెళ్ళుబాబూ - నా బాబువి కదూ!

గోపి: ఇంట్లో నువ్వొక్కర్తెవూ వుండగలవా?

ఇల్లాలు: నాకే మొచ్చింది? రోజూ వుండటంలా?

గోపి: అదికాదు. ఈరోజు నాకోసం పోలీసు లొస్తే రావచ్చు.

ఇల్లాలు: పోలీసులే! నీకోసమే?

గోపి: నువ్వేం భయపడకు. ఇంట్లో లేనని చెప్పు. యిల్లంతా తనిఖీ చేసుకుంటే చేసుకోనీ. వూరొక్క. యింతలో నేనూ వచ్చేస్తాను. సరేనా?

ఇల్లాలు: అలాగే - నువ్వెళ్ళిరా బాబు. (గోపీ వెళ్ళాడు)

ఇల్లాలు: (చాలా కంగారుపడి ఏం చెయ్యాలో తోచక వాళ్ళు చేతులు వణుకుతుండగా వాకిలి తలుపులు వేసింది. ఇటువైపు తలుపులుకూడా వేసి, దేవుని పటంముందు నిలబడి) స్వామీ! భగవంతుడా! రక్షించు. (వాకిట తలుపుతట్టిన శబ్దం. సీత ఉలిక్కిపడి నఖశిఖపర్యంతం వణికిపోతూవుంది. మరల తలుపు శబ్దం)

ఇల్లాలు: (ఇంకా భయంతో) పోలీస్——(అని కేక వేసింది)

(బయటనుంచి "సీతా సీతా" అని కేక. తెప్పరిల్లి తలుపు తీయగా రంగనాథం వచ్చాడు) వచ్చారా?

రంగ: పోలీస్ అని కేకేశావేం? ఎందుకలా వణికిపోతున్నావ్? ఆ నుచ్చెమట లేమిటి?

ఇల్లాలు: ఏం లేదులెండి.

రంగ: వీ డెక్కడ?

ఇల్లాలు: మీకోసం వెళ్లాడు.

రంగ: ఇంతవరకు యిక్కడే వున్నాడా?

ఇల్లాలు: ఇక్కడే వున్నాడే!

రంగ: మరి వూళ్ళో యీ పుకారేంటి? ఎవరి నోట చూచినా వీడి మాటగానే వుందే!

ఇల్లాలు: ఏమని?

రంగ: ఈ ఇల్లుగలాయన - గుప్తాను - వీడు కొట్టాడట పెద్ద గాయం తగిలిందట ఆయన్ను కారులో వేసుకొని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారట.

ఇల్లాలు: అయ్యో అన్యాయమా! అయ్యో అన్యాయమా! యిదేం కాలమండీ?

రంగ: ఏం?

ఇల్లాలు: గుప్తాగార్ని మనవాడు కొట్టాడా? వాళ్ళ నోళ్లు పడిపోను తెలిసే అంటున్నారా? అయ్యో రాకిమూక!

రంగ: ఏమిటీ నీ అఘాయిత్యం?

ఇల్లాలు: మరేమిటండీ? ఆయనే మనవాడి తల చిల్లిపడేటట్టు కొట్టి——పైగా యీ అఘాయిత్య మేమిటండీ?

రంగ: గుప్త యిక్కడికి వచ్చాడా?

ఇల్లాలు: వచ్చాడు. పోనీ ఆ కూడా వచ్చిన శర్మ నడక్కూడదటండీ?

రంగ: శర్మ! వాడు పైసా యిస్తే ఏ గడ్డి అయినా తింటాడు.



Akella Raghavendra's Online-ias.com

ఇల్లాలు: బ్రాహ్మణ పుటక పుట్టాడు కదండి.....మళ్ళీ! న్యాయం అన్యాయంలే? దేవుడు లే?

రంగ: దేవుడు! అదిగో దేవుడు ... సాక్ష్యం చెప్తాడేమో! (దేవుని పటం చూపాడు)

ఇల్లాలు: అయితే ఇక మనగతి ఏం కావాలండి? గోపీని పోలీసులు పట్టుకుపోతారా? వాళ్ళన్నా న్యాయం చూడరా? మీరన్నా వెళ్ళి చెప్పండి; పాపం. ఎంత సుంచున్నారేంటి.

రంగ: ఎవరికెళ్ళి చెప్పమన్నావు?

ఇల్లాలు: ఆ పోలీసులకు.

రంగ: మనం ముందుగా వెళ్ళి చెప్పుకోవడం దేనికి? రానీ అందరం వెళ్తాం. నేనూ వెళ్తాను. జైలులో హాయిగా....ఇదిగో తీసుకో (అని కొన్ని నోట్లు ఇచ్చాడు, కాని సీత జంకుతుంది తీసుకోటానికి) తీసుకో జంకుతావేం తీసుకోటానికి? నేను పోయినా మీరన్నా హాయిగా ఉండండి! సంతోషంగా బ్రతకండి! పూర్తిగా తడిస్తే చలివుండదు. తలనుమించిన శిక్ష వుండదు. తీసుకో!

ఇల్లాలు: ఇదీ లంచం డబ్బేనా?

రంగ: అవును.

ఇల్లాలు: అక్కర్లేదు.

రంగ: ఏం?

ఇల్లాలు: మాపల్లె కాదు - నాపల్లె మీరు (వెక్కి వెక్కి ఏడుస్తూంది.)

రంగ: ఏడవకు! ఏడ్చి లాభంలేదు. సీతా! సీతా!

ఇల్లాలు: ఆఁ!

రంగ: ఇటు చూడు. నా మాట విను. ఇందులో ఎవరి తప్పూ లేదు. ఎవరి పాపమూ లేదు. తిండికి లేనివాడు దొంగతనం చేస్తాడు. కడుపుమాడే ఆడది సాని అవుతుంది. నేనూ అంతే.

ఇల్లాలు: నన్ను చంపేయండి.

రంగ: చంపాను, ఇన్ని రోజులూ చంపాను. నిన్నొక్కరోజన్నా సుఖపెట్టలేదు. ఇన్నాళ్ళు చేసిన పాపం చాలు. కట్టుకున్న భార్యను, కన్నపిల్లల్ని కడుపు మాడ్చే కంటే మహాపాపం కాదులే....సీతా, లంచం తీసుకోవటం ఎవరికి పాపం? ఏది పాపం!

Akella Raghavendra's Online-ias.com

ఇల్లాలు: తెలిస్తే జైల్లో వేస్తారట?

రంగ: ఎవరు చెప్పారు?

ఇల్లాలు: గోపీ.

రంగ: వేస్తే వేస్తారు జైల్లో. రేషన్ తెచ్చుకోవలసిన గొడవలేదు. వేళకు తిండి లేదనే చింతలేదు. ఇక్కడికంటే అక్కడే నయం.

ఇల్లాలు: మీ కొక్కరికి —

రంగ: మిమ్మల్ని జైల్లో వేస్తే అక్కడే కాపురం పెట్టొచ్చు. జైలు గదులు యీ అద్దె కొంపలకన్నా బాగానే వుంటాయి.

ఇల్లాలు: నామాట వినండి. ఈ పాపిష్టి సొమ్ము మనకక్కర్లేదు. ఇచ్చేయండి.

రంగ: పాపం? పిచ్చిదానా! కోర్టులు, పోలీసులు నిర్ణయించేదంతా న్యాయమను కున్నావా? అయిపోయింది. ఇక నా క్కావలసిందేముంది. ఎట్లాగో చెడ్డాను. బాగా చెడతాను, నా సంసారం సంతోషంగా బ్రతకడానికి చెడ్డాను. నా పిల్లలు జబ్బులతో చావకుండా వుండటానికి పాపం చేస్తాను. జైలుకు పోతాను! అవమానాలు భరిస్తాను! చస్తాను! నాక్కావలసింది డబ్బు-డబ్బు-డబ్బు-! (కూలబడ్డాడు) సీతా....ఆ కొత్తచీర కట్టుకో — ఒక్కసారి. యిన్నేళ్ళకొక్కసారి! అట్లా నవ్వుతూ నిలబడు. మళ్ళా ఏం శాశ్వతం? రేపేమౌతుందో; రా సీతా? పిల్లలకు కొత్త చొక్కాలు తొడుగు-సాయంత్రం సినిమాకు వెళ్దాం. ఏం?

డాక్టరు గబగబా వచ్చాడు. సీత వెళ్లలేక వెళ్లింది.

డాక్టరు: రంగా! రంగా!

రంగ: ఏం?

డాక్టరు: చూచావా? గోపీ ఏం చేశాడో?

రంగ: ఏం చేశాడు?

డాక్టరు: బాపూజీ పార్కుదగ్గర ఆహార సమస్యను గురించి యం. యల్. ఎ. ఎవరో మీటింగు పెడితే అక్కడికి వెళ్లాడు.

రంగ: వెళ్ళి........?

డాక్టరు: వెళ్ళినవాడు వూరుకున్నాడా? ఆయన మాట్లాడినంతసేపు వెధవ అడ్డుదిడ్డపు ప్రశ్నలు వేశాడు.

రంగ: ఆఁ.

Akella Raghavendra's Online-ias.com

డాక్టరు: అంతటితో పూర్వోక్త అమాంతం లేచి రౌడీ వెధవలాగు, ప్లాటుఫారం మీదికెళ్ళి నానాకారుకూతలు కూశాడు.

రంగ: ఎవర్ని?

డాక్టరు: ఎవర్ని? ఇంకెవరున్నారు? ప్రభుత్వాన్ని, మంత్రివర్గాన్ని! 'మినిస్టర్' అంటే సరిగ్గా స్పెల్లింగన్నా తెలియని యీ వెధవలంతా ప్లాటుఫాం యెక్కి మంత్రులను విమర్శించడం! వీడి తాహతేమిటి? వీడి రాజకీయజ్ఞానం ఏమిటి? వీడేనా విమర్శించపిలసినవాడు? ఏమిటంటా ఆ వెధవవాగుడు?

రంగ: ఏం కూశాడు?

డాక్టరు: ఒకటా రెండా! ఆ కూతలకర్థం . : అందరూ అమాంతం మహారాజులై బంగళాల్లో వుండాలని కోరితే మంత్రులుకాదు బ్రహ్మదేవుడు మాత్రం ఏం జేస్తాడు? ఇదేం పరిపాల ననుకున్నాడా? పప్పుదప్పళమనుకున్నాడా! ఆఁ-వూఁ-అంటే "స్వతంత్రభారతదేశంలో కూడా" అని ఏడవడం... స్వాతంత్ర్యం వచ్చేస్తే ఆరోజే అందరికి డబ్బుల సంచులు పంచిపెట్తామని చెప్పారా మన వాళ్ళు? ఏమిటంటా ఆ వెధవ వాగుడంతా! వీడికి తిండీగుడ్డా లేకపోతే మంత్రులా? వీడి క్కాలేజీలో సీటు దొరక్కపోతే మంత్రులా? ఏ వెధవలో బ్లాక్‌మార్కెట్ చేస్తుంటే దానికీ మంత్రులే? వెధవ వాగుడు!

రంగ: ఇంత మాట్లాడితే ఆయనేం అనలా?

డాక్టరు: ఆఁ! వీడి మాటలు లక్ష్యపెట్టి జవాబుకూడా చెప్తాడు! ఇలాంటి కుక్కలెన్నో మొరుగుతుంటాయి! అందులో ఆయన గాంధీజీ ప్రియశిష్యుడు. అహింసా వాదవడంవల్ల వూరుకున్నాడు! అదే నేనైతేనా (ఈమాట లంటూండగా మునసలాయన మెల్లగావచ్చి కూర్చున్నాడు)

రంగ: లాగి గెంపేలేకపోయావు వాణ్ణి.

డాక్టరు: కాకుంటే వాళ్ళుమాత్రం ఏం జేస్తారా? పాపం యెన్నని చూస్తారు! మొన్న ప్రొహిబిషన్ పెట్టారా? బస్సులు నేషనలైజ్ చేశారా! లేడీ కండక్టర్సును పెట్టారా? హైదరాబాద్ యుద్ధం ప్రకటించి జయించారా? జమీందారీ బిల్లును గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నారా! బ్లాక్‌మార్కెట్టును నశింపచేసే బిల్లును గురించి తికమకలు పడుతున్నారా? కంట్రోళ్ళను తీసేశారా; మళ్ళీ పెడుతున్నారా....ఎన్నని చెస్తాట్టా? ఊపిరితిరక్క చస్తుంటే? నిన్నూ నీ తమ్ముణ్ణి కాస్సేపు కూర్చోపెడితే సరి ఆ కుర్చీలో మహాచేసేవాళ్ళు. ఆ వచ్చేవాళ్ళకు జవాబు చెప్పలేక చచ్చేవాళ్ళు? వూరికే వాగితే సరా?

Akella Raghavendra's Onlineias.com

రంగ: (నాన్నతో) విన్నారా? మీవాడి ప్రతాపం?

మున: ఏమిటిరా?

రంగ: ఆ గోపీగాడే? కొంపకు అగ్గి తెచ్చాడు. నా వుద్యోగానికే నీళ్లుతెచ్చాడు. పదండి! ఇకేం అంటారూ పదండి. అందరం ఏకంగా ఏ సముద్రమో చూసుకుందాం.

మున: ఏమిట్రా అది! ఏ మొచ్చిందిరా!

రంగ: మీ కుమారరత్నం దేశాన్నంతా వుద్ధరించాలని బయలుదేరాడు. నా కొంప కూల్చాడు.

మున: ఏం చేశాడ్రా?

రంగ: ఏముంది? మీటింగులో మంత్రులమీద ప్రభుత్వంమీద నానారకాలూతలు కూశాడట!

మున: అవునా!

డాక్టరు: అవునండీ?

మున: అయ్యో! వాడికేమొచ్చిందిరా పాడుబుద్ధి!

రంగ: ఇంట్లో తిని పరుండలేక-మదంపట్టి, పొగరెక్కి! ఇంత కూస్తే వూరుకున్నారా? కాల్చి అవతల పారేలా?

డాక్టరు: కాల్చిపారేస్తే ఎంతో నయం కదూ!

మున: ఇప్పుడు వీడెక్కడ్రా?

రంగ: ఇంకా యెక్కడ వుపన్యాసాలిస్తున్నాడో! (గోపి వచ్చాడు. సీత అటువైపు నుంచి వచ్చింది) అయిందట్రా వుపన్యాసాలు? నన్నెందుకురా ఇట్టా చంపుకు తింటావ్? ఈ వుద్యోగమన్నా వుండటం నీ కిష్టంలేదురా? ముష్టెత్తుకొని బతకాలని వుందా? ఆ పిల్లలు బతకడం నీ కిష్టంలేదేం! చెప్పరా!

గోపి: ఏమిటన్నయ్యా?

మున: ప్రభుత్వం-మంత్రివర్గం అవి ఎలాపోతే నీ కెందుకురా? ప్రపంచాన్నంతా వుద్ధరించటానికి నువ్వు పుట్టావట్రా! నీ వాగుడు ఎంతదూరం పోతుందో యోచించావా? ఈ సంసారంకోసం వాడన్నివిధాలా చివికి చస్తూండటం చూస్తూకూడా యిదేంపనిరా గోపీ!

గోపి: నాన్నా! అన్నయ్యా! ఏంచేశాను?

రంగ: ఏం చేశానంటావట్రా యింకా? (దుఃఖం కోపం రెండూ వచ్చాయి చెయ్యెత్తాడు. కానీ, ఆ చేత్తోనే తల బాదుకొని) నా ఖర్మ? నా గ్రహచారం.

Akella Raghavendra's Online-ias.com

('రంగనాథంగారూ' - అన్న కేకతో పాటు పోలీసు సబిన్‌స్పెక్టరు, కానిస్టేబుల్ వచ్చారు. డాక్టరు, రంగనాథం గోపి ముసలాయన ఒక్కసారే "పోలీస్" అన్నారు.)

ఇల్లాలు: పోలీస్!

ఎస్.ఐ.: ఆ! పోలీస్-కనపట్టంలే? రంగనాథం నువ్వేనా?

రంగ: అవును.

ఎస్.ఐ.: మీ యిల్లు తనఖీచెయ్యాలి?

రంగ: మా యిల్లా!

ఎస్.ఐ.: ఆఁ మీ యిల్లే! ఏయ్ సోదాచెయ్యి. గోపి నీ తమ్ముడేనా?

గోపి: అవును.

ఎస్.ఐ.: నిన్నుకాదు అడగటం.

గోపి: నేనే ఆయన తమ్ముణ్ణి.

ఎస్.ఐ.: నువ్వేపార్టీ.

గోపి: టీ పార్టీ.

రంగ: గోపి ——

ఎస్.ఐ.: ఊఁ. పరిహాసంగా వుందే!

గోపి: లేకుంటే మాకు పార్టీలేమిటండీ! ఇంట్లో రోగాలతో చాకిరితో చస్తుంటే! అసలు దినంగడవటం కష్టంగావుంటే మాకు పార్టీ లేంటి?

ఎస్.ఐ.: ఆ మాటలే చెప్తాయి నీ వే పార్టీ అయింది.

గోపి: అవును! వున్నది చెప్పుకోవడంకూడా పార్టీ మాటలే - (అటకమీద వున్న కాగితాలు పోలీసు చూచి ఒకబొమ్మ తెచ్చి ఎస్.ఐ. కివ్వగా ఆయన దాన్ని పరికించి చూచి)

ఎస్.ఐ.: ఈ బొమ్మ ఎవరిది?

గోపి: నాదే.

ఎస్.ఐ.: ఎక్కడ కొన్నావ్?

గోపి: కొనలే. నేనే గీచా నా బొమ్మ!

ఎస్.ఐ.: ఏమిటా బొమ్మ?

గోపి: మీక్కనపట్టంలే?

ఎస్.ఐ.: చెప్పవోయ్! నీ నోటిగుండా చెప్పించాల.

గోపి: పల్లెపడుచు.

ఎస్.ఐ.: ఆవిడ నెత్తిమీద్దేంటి?

గోపి: గడ్డిమోపు.

ఎస్.ఐ.: ఆవిడ చేతిలో ఏమిటి?

గోపి: కొడవలి.

ఎస్.ఐ.: ఆవిడ చేతిలో కొడవలిపెట్టడంలో నీ అభిప్రాయం?

గోపి: పల్లెపడుచు చేతిలో కొడవలుండక, టెన్నిసు రాకెట్టుంటుందాండీ?

ఎస్.ఐ.: షటప్!

రంగ: గోపీ!

మున: గోపి ఏమిట్రా? ఆ కూతలు ఏమిట్రా? సార్! ఏదో కుర్రాడు తెలియక కూశాడు. మన్నించండి. నన్ను చూచన్నా....

ఎస్. ఐ.: వాడు కుర్రవాడైతే యీ పెద్దమనిషేం చేశాడో చూడండి. ఏయ్! ఆ కోటిలా తీసుకో.

రంగ: (ముఖాన నెత్తురుచుక్కలేదు.)

ఎస్.ఐ.: (పోలీసు కోటు తెచ్చి యస్.ఐ. కిచ్చాడు. కోటులో నోట్లు పైకితీసి) ఊఁ- ఈ నోట్లెక్కడివి? నిన్నే అడగటం! ఈ డబ్బెక్కడిది?

రంగ: నాదే.

ఎస్. ఐ.: నీదే. ఎక్కడనుంచి వొచ్చింది?

డాక్టరు: ఏమిటండీ యిదీ?

ఎస్. ఐ.: ఏముందీ? లంచంసొమ్ము. కరెప్షన్! చూడండి కలెక్టరుగారి సంతకం.

డాక్టరు: ఉంటే?

ఎస్.ఐ.: ఇది లంచం సొమ్ము. కరెప్షన్ పట్టుకోడానికి ఇలాటి నోట్లు కొన్ని పంపుతున్నారు. ఏమయ్యా! ఇది లంచం సొమ్మేనా? పలకవేం.

రంగ: అవును.

మున: లంచం? నువ్వేనట్రా! లంచం తీశావట్రా?

రంగ: అవున్నాన్నా.

మున: అయ్యో! అయ్యో! ఇదేం ఖర్మరా! ఇదేం పాడుకూడురా? మన కెందుకురా! మన వంశంలో లేదుగదరా! కొంపకు అగ్గి పెట్టుకున్నావుగదరా! అయ్యయ్యో!

రంగ: నాన్నా! ఊర్కో నాన్నా! ఏడ్చి ఏం లాభం? అయిపోయింది!

మున: పెద్దవాణ్ణి - నాతో ఒకమాటన్నా చెప్పకూడదట్రా. ఇన్స్పెక్టరుగారు! నా మాట వినండి. నేనూ గవర్నమెంటు వుద్యోగం చేశాను. ముప్పైసంవత్సరాలు

Akella Raghavendra's Online-ias.com

ప్రభుత్వానికి నా శక్తంతా ధారపోశాను. చివరకు రోగం మిగుల్చుకున్నాను. మూలపడ్డాను. నేనెన్నడూ ఈ పాడుకూడెరుగను. పసితనం. వాడు .... వాడు . ఈ సంసారంకోసం చేశాడు. మన్నించండి. ..కనికరించండి.

ఎస్.ఐ.: ఏం లాభం లేదండీ? ఇది కలెక్టరుగారి వుత్తర్వు - ఏమయ్యా! ఈ నేరాన్నొప్పుకుంటావా?

రంగ: ఒప్పుకుంటా. లంచంతీశా! కక్కుర్తిపడ్డా. నిజమే. నా పెళ్ళాంబిడ్డలు రెండు పూటలూ తిండితిని బ్రతికేదానికోసం యీ పని చేశాను. పాపమని తెలిసే చేశాను. మీరే చూడండి - ఈ సంసారం ఈ బ్రతుకు, లక్షాధికార్ని కావాల చేయలేదు. నా బిడ్డలకు పాలక్కూడా గతిలేకుంటే చేశాను. 80 రూపాయల జీతంతో బతకలేక చేశాను. 30 రూపాయలు ఇంటి అద్దెకిచ్చి యింకెలా బతకమంటారు? ఆ పసికూనలు అలా రోగాలతో కుళ్ళి చస్తూంటే ఎలా చూస్తూ కూర్చోమంటారు? నా హృదయం ఓర్వలేకపోయింది. నా ఓర్పు సహించలేకపోయింది. వాళ్ళను కన్నాను నా కన్నకడుపు వూర్కోలేకపోయింది. ఏం చెయ్యమంటారు? మీరేం చేస్తారో చెయ్యండి; నేను సిద్ధంగానే వున్నాను.

ఎస్.ఐ: లంచంతీయడం నేరమనీ శిక్షిస్తారనీ తెలిసే చేశావా?

రంగ: అవును.

గోపి: నేరం! పెద్దలూ, అధికారం కలవాళ్ళూ వేలకువేలు లంచం తీస్తే గప్‌చిప్! అది నేరంకాదు. అది బయటికే రాదు. వాకిట కాపలాకాచేవాడు కడుపు మాడి కాసుకు చేయిజాస్తే అది నేరం! అది లంచం! దానికి శిక్ష!

ఎస్.ఐ: ఏయ్! షటప్!

రంగ: గోపీ! నువ్వూర్కో అది లాభంలేదు. తప్పుచేశాం. ఒప్పుకుంటాం, జైలుకు తీసుకుపోతారా పోనీ! పోదాం! అంతకన్నా చేసేదేమీలేదు ఎస్.ఐ.గారు మీ యిష్టం.

ఎస్.ఐ: మిమ్మల్నిద్దర్నీ అరెస్టుచేశాం కదలండి.

ఇల్లాలు: ఇద్దర్నీ అరెస్టా? అరెస్టా?

రంగ: గోపీనికూడా? గోపీని అరెస్టా?

డాక్టరు: గోపీ ఏంచేశాడండీ? అతన్నెందుకు అరెస్టు?

Akella Raghavendra's Online-ias.com

ఎస్.ఐ: ఎందుకంటే....గుప్తగార్ని కొట్టినందుకు! పబ్లిక్ మీటింగులో అరాచకాన్ని రెచ్చకొట్టే వుపన్యాసం యిచ్చినందుకు! దేశ శాంతి భద్రతలు కాపాడ్డానికి అతన్ని అరెస్టు చేస్తున్నాం.

రంగ: సరే.. పదండి.

ఇల్లాలు: మమ్మల్ని - ఆ పసికందుల్ని - నన్నుకూడా తీసుకెళ్ళండి. మీతోపాటు వుంటాం మీ రెక్కడుంటే అక్కడే (రంగనాధం కాళ్ళమీద పడింది.)

రంగ: సీతా! వూర్కో మిమ్మల్ని తీసుకెళ్ళడం నా చేతుల్లో వుందా. ప్రభుత్వం దయతలిస్తేగా?

ఇల్లాలు: అయితే (లేచి యస్.ఐ. దగ్గరకెళ్ళి) కనికరించండి నన్ను చూచన్నా కనికరించండి. నా వల్లనే ఆయన ఆ పాపం చేశారు. నన్ను పోషించడానికి. నా పిల్లల్ని పెంచటానికి? ఆయన అలాంటివారు కారు. ఎన్నడూ అలా చెయ్యనూ చెయ్యలేదు. నా మాట నమ్మండి. మీ కా డబ్బంతా యిచ్చేస్తా! ఇదిగో....అంతా తీసుకోండి. ఇంకా కావలిస్తే నా పుస్తే....అన్నీ....కనికరించండి?

ఎస్.ఐ.: ఇస్? వూర్కోవమ్మా? ఏం లాభంలేదు. ఇది ప్రజాప్రభుత్వం. స్వరాజ్యం వచ్చిన తరువాత మనవాళ్ళు లంచగొండితనాన్ని అణచివేస్తున్నారు.

ఇల్లాలు: మీకు హృదయంలేదు. మీకు నాలాంటి అక్కచెల్లెళ్ళు లేరూ? మీకు బిడ్డలూ పాపలూ లేరూ? ఆ పసికందుల్ని చూడండి? మేమంతా యిక వస్తులుపడి చావాల్సిందేనా! ఇదేనా స్వరాజ్యం?

గోపి: అవును అదే స్వరాజ్యం. చాలకపోతే లంచం తీశాం. తిండికి లేకుంటే లంచం తీశాం. ఏది....మీ ప్రజాప్రభుత్వ పరిపాలకులను బ్రతకమనండి 80 రూపాయలతో తెలుస్తుంది.

ఇల్లాలు: మీరు మనుష్యులేనా?

ఎస్.ఐ: ఏయ్! (చెయ్యెత్తాడు.)

గోపి: ఏయ్. కబడ్దార్! ఛీ! ఆడదానిమీదకి చెయ్యెత్తావ్!

ఎస్.ఐ: కదలండి!

రంగ: కాస్త ఆగండి. ఒక్కమాట. సీతా!

ఇల్లాలు: (ఏడుస్తుంది.)

రంగ: ఏడవకు. మన బతుకు ఇంతే. పాపాయి జాగ్రత్త! వాడికి జ్వరం తగ్గిపోతుందిలే. డాక్టరుగారూ....

Akella Raghavendra's Online-ias.com

డాక్టరు: రంగా!

రంగ: (డాక్టరు చేతులు పుచ్చుకొని ఏడుస్తూ) నా పిల్లలు జాగ్రత్త! నేను జైలునుంచి వచ్చేటప్పటికి - వాళ్ళుంటారో లేదో!

డాక్టరు: రంగా - పూర్కో నీ పిల్లలకు నా ప్రాణం యిస్తాను.

షుస: తీసుకెళ్ళండి! అందర్నీ జయిలులో వెయ్యండి. ఆ పిల్లల్ని గొంతుల్నులిమి చంపేసిపోండి. (పడిపోయాడు.)

ఇల్లాలు: (తిరిగిచూచి కెవ్వుమని కేక వేసింది.)

అంతే.

Akella Raghavendra's
Online-ias.com